POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జనవరి 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 41 సంచిక: 09




## శ్రీ వివేకానంద స్వామి జయంతి

(12-01-2024)

## ఈ నెల పండుగలు

**జనవరి - 10 - శ్రీ అనసూయ మాత (పరాడ్ సింగా) ఆరాధన**
**జనవరి - 12 - వివేకానంద స్వామి జయంతి**
**జనవరి - 16 - అవధూత శ్రీ రామిరెడ్డి తాత ఆరాధన**
**జనవరి - 25 - భగవాన్ రమణ మహర్షి జయంతి (తిథి - పుష్య పౌర్ణమి)**
**జనవరి - 27 - శ్రీ తాజుద్దీన్ బాబా జయంతి**

*సాయిబాబా పత్రిక పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!!*

"సృష్టి అంతటా వున్నది అనుభవం కాకపోవడానికి గాని, దానిని గుర్తుపట్టకుండా పోవడానికిగాని – ఈ జగత్తు వేరు, నేనువేరు అనే ఒక్క పొర చాలు. అందుకని ఆ పొరను తొలగించి ఆ సన్నిధిలో వుండకపోయినా ఆ స్థితికి తీసుకుపోయేందుకు దోహదపడేది చరిత్ర పఠన మాత్రమే. అందుకని పారాయణ అంత గొప్పది. అందుకని గ్రంథ పారాయణ అనే సాంప్రదాయం వచ్చింది."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# జ్ఞాని మాటకర్థం జ్ఞానులే తెల్పాలి!

***పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ***

భగవంతుడు, గురువు, ఆత్మ వేరు కాదని ఈ మూడు మూర్తులలోను వున్నది ఒకటేనని ఆదిశంకరులు దక్షిణామూర్తి స్తోత్రంలో స్పష్టంగా వ్రాసారు. కానీ ఆ సత్యాన్ని ప్రత్యక్షానుభవంగా తెల్పేవారే గురువని, కనుక గురువు నాశ్రయించడం ఎంతో అవసరమని ఆదిశంకరులే కాక ఆధ్యాత్మిక సాంప్రదాయాలన్నీ చెబుతున్నాయి. భగవాన్ శ్రీ రమణ మహర్షి దానిని యిలా వివరించారు: "మానవుడు మొదట కష్టాలు తొలగాలని, కోరికలు తీరాలని పరమాత్మను ఆశ్రయిస్తాడు. తర్వాత క్రమంగా భగవంతుని ప్రేమించడం నేర్చుకొని, ఆయనను చేరుకోవాలని ఆరాటపడతాడు. అప్పుడు భగవంతుడే ఒక గురువు రూపంలో అతడికి తారసిల్లి అనుగ్రహిస్తారు. క్రమంగా ఆ గురువు, తన ఆత్మ, భగవంతుడూ ఒక్కటేనని ముముక్షువు తెలుసుకుంటాడు. అదే జ్ఞానం."

ఈ చక్కని సత్యాన్ని సాయి తమ భక్తులకు ఎలా తెలిపారో చూద్దాము.

ఒకసారి ఒక భక్తుడు, ఎన్నో సమస్యలు, కష్టాలు తీరాలన్న ఆశతోనూ, కోరికలు నెరవేరాలన్న దృష్టితోనూ శిరిడీ వస్తున్న సాటివారికి 'శ్రీ సాయి వంటి సత్పురుషుని అలాటి తుచ్ఛమైన లౌకిక తలంపులతో దర్శించరాదని, కేవలం నిష్కామ భక్తిభావంతో దర్శించాలని' బోధించనారంభించాడు. వెంటనే సాయి అతనిని పిలిపించి అతడలా చెప్పటం తగదని, మొదట తమను అందరూ అలానే లౌకికమైన ఆశలతో ఆశ్రయించి క్రమంగా ప్రేమతో నిష్కామంగా సేవించడం నేర్చుకుంటారని చెప్పారు. 'శ్రీసాయిలీలామృతము' లోని భక్తుల అనుభవాలు ఎన్ని చూసినా యిదే సత్యం గోచరిస్తుంది. చివరికి ఆయనను సేవించిన వారిలో అగ్రగణ్యులుగా లోకఖ్యాతినందిన ఉపాసనీ బాబా మాత్రం సాయిని ఎందుకు మొదట ఆశ్రయించింది? ప్రాణాయామం చేస్తుంటే ఏదో పొరపాటు జరిగి శ్వాస సరిగా ఆడకపోయినప్పుడు ఆ బాధ తొలగాలనికదా ఆయన సాయిని ఆశ్రయించింది? ఇప్పటికి ఒక అంశాన్ని వివరించుకున్నాము. మొదట కోరికలతోనే మానవుడు భగవంతుని శరణు పొందుతాడని, పొందవచ్చని. వారి భక్తి సరైన స్థాయికి చేరాక, సాయి వంటి సద్గురువు రూపంలో ఆ దైవమే దర్శనమిస్తారని కూడా ఈ భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి. ఇక ఈ గురువు మూడవ సత్యాన్ని ఎలా భక్తులకు తెలుపుతాడో చూద్దాము.

శ్రీ సాయిని ప్రత్యక్షంగా దర్శించిన వారిపై ఆయన సాన్నిధ్య ప్రభావమెలా వుండేదో నన్న విషయాన్ని 'శ్రీమతి మేనేజర్' అనే భక్తురాలు యిలా వర్ణించింది. "ఆయన మన హృదయంలోనేకాక, శరీరంలోని ప్రతి అణువులోనూ నిండియున్నారనిపించేది. ఆయన పలికిన కొద్ది మాటలు, చేసిన ఒక్క కదలిక వలన ఆయనకు మన భూత, భవిష్యత్, వర్తమానాలు సర్వమూ తెలుసునని అర్థమైపోతుంది. సంపూర్ణమైన విశ్వాసంతో ఆయనను శరణు పొందడం తప్ప చేయవలసినది వేరేమీ తోచేదికాదు. ఆయన సన్నిధిలో అడుగుపెట్టిన దగ్గరనుండీ ఆయన సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు, సర్వగతుడూ అన్న అనుభవం కలుగుతూనే వుండేది. ఆయన రక్షణ అనుక్షణమూ అనుభవం అయ్యేది."

క్రమంగా ఈ అనుభవం ఆయన సన్నిధిలోనే కాక,

***మిగతా 29వ పేజీలో***

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:41 జనవరి - 2024 సంచిక:09

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | జ్ఞాని మాటకర్థం జ్ఞానులే తెల్పాలి! | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | నూతన ఆంగ్ల సంవత్సరాది | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి పద్మజా నరహరి | 08 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 10 |
| 06. | జనార్ధన్ గల్వంకర్ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 13 |
| 07. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 17 |
| 08. | పుంభావ సరస్వతి | శ్రీ సి. హెచ్. పాండురంగ శర్మ | 23 |
| 09. | ద్వారకామాయి అనుభవమండపము | K.C. పోటే | 25 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ కోటేశ్వరరావు, బాపట్ల | 26 |


**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

## ప్రశ్న :- సాయినాథుని ప్రాతఃకాలం నుంచి రాత్రివరకూ ఎలా పూజ చేయాలి? గురు దక్షిణ, భిక్షలు ఎలా జరపాలి?

– ఎ. సత్యనారాయణ, సూళ్ళూరుపేట

**జవాబు :-** శ్రీ సాయి ఎప్పుడు ఎల్లెడలా వుంటారు. కాని ఆ విషయం గుర్తు పెట్టుకున్నవారికి గుర్తు పెట్టుకున్నంత ఫలితం వుంటుంది. చంచలమైన మనస్సుగల పామరులకు బాహ్యమైన విషయాల ప్రభావమే ఎక్కువగా వుండి, ఆ విషయం గుర్తుండదు. కనుక రోజంతా తమకు సద్గురువు యొక్క సాన్నిధ్యముంటుందన్న సంగతి గుర్తుంచుకోడానికి అలంబనగా మూర్తి పూజ విధించబడినది. ప్రత్యక్షంగా సాయినాథుడు మనతోవుంటే ఉదయం నుండి సాయంత్రము వరకు ఏ సేవలు చేస్తామో, వాటిని మందిరంలోని మూర్తికి అలానే చేయాలి. నిదురలేవగానే ఎంతటి మహనీయుడు మన చెంతనున్నాడో గుర్తు రావాలి. అదే ప్రాతఃస్మరణయైన ధ్యానము. తర్వాత సర్వమూ సిద్ధంచేసి నిత్యకృత్యానికి నిదురలెమ్మని ప్రార్థించాలి. మనం నిత్యకృత్యాలు తీర్చుకుని బాహ్యాంతరాలను శుద్ధి చేసుకొని వారి సేవ కుపక్రమించాలి. అప్పుడు చేసే సేవనే 16 ఉపచారాలుగా పూజా విధానం రూపొందించింది. గృహస్థ ధర్మాలను నిర్వర్తించుకోవలసిన అవసరం వలన రోజుకు రెండుమూడుసార్లు మాత్రమే పరిమిత సమయాలలో పూజ చేస్తాము. కానీ పూజయే తన విధిగా కల అర్చకుడుగాని, లేక అవకాశం కలిగినపుడు మనంగాని ఉదయంనుండి సాయంత్రము వరకు మనం చేసుకునే ఉపచారాలన్నింటిని వారికి ఆయా సమయాలలోనే చేయాలి. మన స్నానమయ్యాక అంత వివరంగానూ వారికి స్నానం చేయించాలి. మన భోజనానికి ముందు అంత వివరంగానూ వారికి నైవేద్యమివ్వాలి. భోజనమయ్యాక నిజమైన సత్పురుషుడు పగలు నిద్రించడు. అందువలన భోజనమయ్యాక మనముగూడ ఆయన సన్నిధిలో, సద్గ్రంథ పఠనమో, శ్రవణమో చేయాలి. రాత్రి వారిని నిద్రపుచ్చాకనే మనము భగవత్ స్మరణతో నిద్రించాలి. ఇదీ మన శరీరాన్ని వారి సేవ కర్పించడమంటే! వారి బోధలు మననం చేసికొని, మన ప్రవర్తనను, మనోభావాలను సంస్కరించుకోవడమే, వారిని ధ్యానించడమే, మనస్సు నర్పించడమనే మంత్రపుష్పం. వారి లీలలను, బోధలను ప్రక్కవారికి తెల్పి లోకకళ్యాణానికి తోడ్పడడము, మహాత్ములను చక్కగా ప్రశ్నించి సద్విషయము తెలుసుకొనడము, సద్భావంతో సాటివారితో మాట్లాడడము వాచికమైన సేవలౌతాయి. ఇట్టి శ్రద్ధతో జీవితమంతా గడపడమే మానసికమైన దక్షిణ. మనమార్జించిన ధనాన్ని, ఆయన బోధించి ఆచరించి చూపిన ఈ ధర్మంతో సాటివారిని ప్రభావితులను చేయడానికి, నిరుపేదలకు, పరమేశ్వరార్పణ బుద్ధితో అన్నవస్త్రాలివ్వడానికి వినియోగించడమే దక్షిణ సమర్పణ, మరియు భిక్ష. జీవితంలో అనివార్యంగా కల్గే కష్టనష్టాల నడుమ ఈ జీవిత విధానాన్ని మరువకుండడమే నిష్ఠ, సబూరీలతో జీవించడమంటే. ఇలా జీవిస్తే ఆవాంఛనీయ మనోభావాలకు తావుండదు. క్రమంగా యింద్రియ మనోజయం దానికై అదే సిద్ధిస్తుంది. ఇలా చేయగల్గాలంటే, తరచుగా వారి చరిత్ర పారాయణ, బోధల మననము చేస్తుండాలి. ఇలాగాని పూజ వ్యర్థము. క్రమంగా లౌకిక విషయాల ప్రాబల్యం ఎక్కువై పూజ యాంత్రికము, నిర్వీర్యము అవుతుంది! 'నిరంతరము పూజ చేయువాడు' అవడం మాని పూజకు 'అరి' లేక 'శత్రువు' అవుతాడు. ●

(జనవరి 2015 సాయిబాబా మాసపత్రిక నుండి)

# నూతన ఆంగ్ల సంవత్సరాది

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

2015 – నూతన ఆంగ్ల సంవత్సరం ప్రవేశించబోతుంది. గడచిన సంవత్సరంలో కొందరు సుఖంగా జీవించి వుండవచ్చు. కాని ఎక్కువ శాతం ప్రజలు కష్టసుఖాల మేళవింపులోనే తమ జీవితాలను గడిపి వున్నారనేది కాదనలేని సత్యం. కాలం గడుస్తున్న కొద్దీ జీవులు పుట్టడం, కొంత కాలం సుఖదుఃఖాలలో జీవించడం చివరకు మరణించడం జరుగుతూనే వుంటుంది. ఇది సహజమైన ప్రకృతి సూత్రం. కాని దీనిని సహజంగా మాత్రమేగాక తమ ఇష్టానుసారం సుఖశాంతులతో గడపాలని తలచడం మానవుని ప్రత్యేకత. ఈ సుఖశాంతులనే పదానికి నిర్వచనం ఎవరి సంస్కారాన్ని బట్టి వారికి వుండటంవల్ల భేదాభిప్రాయాలు ఏర్పడుతూ వుంటాయి. నిజంగా సుఖము, శాంతి అంటే ఏమిటి? అని నిర్దుష్టంగా ఆలోచిస్తేగాని నిజమైన సుఖశాంతులంటే ఏమిటో అర్థం కావడం కష్టం. ప్రతి మానవుడూ తమ ఇష్టాయిష్టాల ప్రకారం ఇతర మానవులేకాక ప్రతి ప్రాణీ మసలుకోవాలనుకోవడంలోనే అశాంతి మొత్తం దాగి వుంది. మన ఇష్టప్రకారం మనం ప్రవర్తించాలనుకోవడంలో తప్పు లేదుగాని, ఇతరులు కూడా మన ఇష్టప్రకారము ప్రవర్తించాలనుకోవడం అమానుషం. అవతలి వారు మన ఇష్టప్రకారం నడుచుకోవాలనుకోవడం లోనే ఆశాంతి దాగి వుంది. మనం చెప్పినవి మంచివి కావచ్చు, కాకపోవచ్చు, ఏదైనా అవతలి వాడికి యిష్టమవ్వాలి కదా! మనకు ఇష్టంలేని పని మనం ఎలా చెయ్యలేమో ఒకవేళ చేసినా అయిష్టంగా, బలవంతంగా చేస్తామో అలాగే అవతలి వాడికీ వుంటుందనేది గ్రహించినపుడు ఈ సమస్య తలెత్తదు, ఒకవేళ ఎవరైనా 'నేను అవతలి వాడు చెప్పిందల్లా చేస్తాను' అనో, లేక 'మా నాన్న చెప్పిందల్లా చేస్తాను' అనో, లేక 'మా అమ్మ చెప్పిందల్లా చేస్తాను' అనో – ఇలా కొంతమంది చెప్పినవి చేస్తామని చెప్పారనుకోండి, దాని అర్థం ఏమిటి? ఒకసారి ఇదే విషయంలో పూజ్యశ్రీ మాస్టరుగా ఇలా చెప్పారు: "ఎవరైనాసరే అవతలివారి ఇష్టప్రకారం ఏ విషయంలోనైనా ప్రవర్తిస్తున్నారంటే అర్థం వారికి ఇష్టమైనది చెయ్యడం వీరికి ఇష్టమవ్వడం వల్లనే. అలా కాకపోతే బలవంతంగా చెయ్యడం జరుగుతుంది. అందుకని ఏ మనిషైనా తన ఇష్టప్రకారం నడుచుకుంటాడు, నడుచుకోవాలనుకుంటాడు. అలా ఉండచ్చు, ఉండలేకపోవచ్చు. అందుకని అవతలి వారిని బలవంతపరచకపోవడం మంచిది!"

అయితే ఎవరినైనా వారి ఇష్టాయిష్టాల ప్రకారం వదిలి వేయడమేనా, ఒకవేళ అవతలి వారి ఇష్టం మంచిది కాకపోతే దాని వల్ల జీవితంలో ఎంతో నష్టపోతారని మనకు స్పష్టంగా తెలుసు. అప్పుడు కూడా వారిని సరిదిద్దకపోవడం

ధర్మమేనా? అని కొందరు తలచవచ్చు. "తప్పకుండా చెప్పవలసినదే. కాని బలవంతపరచకూడదు. ఆపైన వారిని సరియైన మార్గంలో నడపమని భగవంతుడిని ప్రార్థించాలి. "బుద్ధిః కర్మానుసారిణే – కర్మను అనుసరించి బుద్ధి నడుస్తుంది" అని పెద్దలు చెప్పివున్నారు కదా! అందుకే బాబా ఒకరితో, "ఒకటి రెండుసార్లు నిన్ను హెచ్చరిస్తాను. ఆపైన నీ కర్మకు నిన్ను విడుస్తాను" అన్నారు. బాబా వంటి మహాత్ములు ఎందరో మనకు సరియైన మార్గాలను బోధిస్తూనే వున్నారు. కాని మనము ఎంతవరకు వాటిని ఆచరిస్తున్నాము? ఆచరించటానికి ప్రయత్నిస్తున్నాము? అంతటి వారు చెప్పినప్పుడే ఆచరించలేక పోతున్నపుడు, ఇక సామాన్యులమైన మనము చెప్పినప్పుడు మన బిడ్డలుగాని, పెద్దలుగాని, బంధుమిత్రులుగాని ఇతరులు గానీ ఎలా ఆచరించగలరు? ఈ విషయాన్ని మనం గ్రహించినపుడు ఇతరులను బలవంతపరచడం అనవసరమనిస్తుంది. అయినా సర్వజ్ఞులైన మహాత్ముల వచనాలు సరియైనవిగాని; మన సలహాలు, మన అభిప్రాయాలు సరియైనవి కావచ్చు, కాకపోవచ్చు. అటువంటప్పుడు మనదే సరియైనదని అనుకుని అవతలి వారిని బలవంతపరచడం ఎంతవరకు సమంజసం? ఒకవేళమన అభిప్రాయం సరియైనదైనప్పటికీ అవతలి వారికి అది సరియైనదనిపించాలి కదా! ఉదాహరణకు దొంగతనం చేసేవారికి, వ్యభిచారం చేసేవారికి తప్పని చెప్పినా వినరు. కారణం అవి వారికి సరియైనవి అని అనిపిస్తుంటుంది. లేకపోతే అలా చేయలేరు. ఒకవేళ తెలిసో తెలియకో అలాంటి పనులు చేసినా ఇది తప్పని తెలిసిన తరువాత చెయ్యడం సాధ్యం కాదు. తప్పక మానుకుని తీరుతాడు. కనుక ఎవరికి వారికి తాము చేసేది సరియైనదనిగాని తప్పనిగాని అనిపించవలసినదే కాని మరొకరు బలవంత పరచేది కాదు.

ఈ విధమైన వివేచన వల్ల మనకు మనం కోరుకున్న శాంతి ఎట్టి పరిస్థితుల్లోనూ లభిస్తుంది. అప్పుడు కాలాన్ని మనం అనుకున్నట్లు సద్వినియోగ పరుచుకున్న వారమవుతాము. లేకపోతే ఇష్టాయిష్టాల సంఘర్షణలో పడి అల్లాడిపోతుంటాము. ఒక్కొక్క నూతన సంవత్సరం వస్తున్న కొద్దీ మనం మృత్యువుకు అత్యంత దగ్గర అవుతూంటాము. అయితే నడుస్తున్న కాలంలో మనం సాధించవలసినదేమిటి? చంచలమైన ఈ సృష్టిలో వుండి కూడా నిశ్చలమైనదానిని సాధించాలని మహాత్ములు బోధిస్తున్నారు. "గురువును తెలుసుకోవాలి. మానవ జన్మ ఎత్తినదెందుకు? గురువుని తెలుసుకోవడానికే. లేకపోతే పిడకలు ఏరుకోవడానికా?" అని బాబా కూడా చెప్పారు. నిశ్చలమైన తత్త్వం ఏదైతే ఉన్నదో, దానిని సాధించిన వాడే గురువు. ఆయనే ఆ తత్త్వం. మిగతా అందరం లఘువులమే. అట్టి గురువును ఆశ్రయించినపుడు మనమూ పొందవచ్చు.

సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని ఆశ్రయించి, ఆరాధించి – అట్టి నిశ్చల తత్త్వాన్ని సాధించిన వారు మన పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు. ఆయన కూడా మనలాగానే జీవించారు. ఎన్నో మంచి కార్యాలు నిర్వహించారు. ఎన్నో ఒడుదుడుకుల్ని ఎదుర్కొన్నారు. సామాన్య సాంసారిక జీవనాన్ని గడిపారు. వీటన్నింటినీ ఆచరిస్తూనే వీటికతీతమైన స్థితిలో నిశ్చలంగా ఎప్పుడూ వుండేవారు. అందుకే ఆయన ఎటువంటి ఒడుదుడుకులకూ చలించకపోవడం వారికి పరిచయం వున్నవారందరికీ తెలుసు. అంతేకాదు, ఆయనను ఆశ్రయించిన వారందరికీ ఆయన సన్నిధిలో అట్టి స్థితి అనుభవమవుతూ వుండేది. చంచలమైన వారి మనస్సులకు వారి వారి సంస్కారాలను బట్టి నిశ్చల తత్త్వం అనుభవమవుతూ వుండేది. వారు కూడా కొంతవరకు కష్టసుఖాలను ధైర్యంతో ఎదుర్కొనగలిగారు. అంతేకాదు, ఆయన గ్రంథాలను చదివిన వారు, ప్రవచనాలను విన్నవారు, ఇప్పటికి కూడా నిశ్చల తత్త్వ స్వరూపులైన సమర్థ సద్గురువులైన మాస్టరు గారిని ఆశ్రయించి ఆరాధిస్తూ ఆయన చెప్పిన విధంగా నడుచుకుంటూ అట్టి నిశ్చలమైన శాంతిని పొందుతున్నారు.

అందుకని రాబోవు నూతన సంవత్సరంలో మనం కూడా వివేక పూరితమైన పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రవచనాలను నిరంతరం స్మరించుకుంటూ ఆచరించడానికి, ప్రయత్నిస్తూ అట్టి నిశ్చలతత్త్వాన్ని పొంద ప్రయత్నిద్దాము. సుఖశాంతులను పొందుదాము. అందుకు తగిన శరణాగతిని, మనస్థైర్యాన్ని ప్రసాదించమని సమర్థ సద్గురువులైన సాయినాథుని, పూజ్యశ్రీ మాస్టరుగారిని హృదయపూర్వకంగా ప్రార్థిద్దాము.

# మాతృదేవి స్మృతులు

*శ్రీమతి పద్మజా నరహరి*

హైదరాబాదు(నాగోలు) వాస్తవ్యులు శ్రీమతి పద్మజా నరహరిగారు పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి తో వారి స్మృతులను, అనుభవాలను ఈవిధంగా పంచుకుంటు న్నారు.

మేము పూజ్యశ్రీ మాస్టరుగారి బాటలోకి రాకముందు, పూజ్య రాఘవేంద్రస్వామిని ఆరాధించేవాళ్ళము. ఆ సాంప్రదాయాన్ని అనుసరించేవాళ్ళము. ఆ పరంపరలో వున్న పీఠాధిపతి శ్రీ సుషమీంద్రస్వామి హైదరాబాదు వచ్చినప్పుడు, వారిని దర్శించుకుని సేవించుకునేవాళ్ళము. కొన్నాళ్ళకు వారు సమాధి చెందారు. అప్పుడు మాకు చాలా బాధకలిగింది. ఇంక మేము ఎవరిని ఆశ్రయించాలి? మాకు దిక్కు ఎవరు? అనిపించేది.

2008వ సంవత్సరములో, మౌలాలీలో శ్రీ టి.వి. రావు గారింటిలో అద్దెకు దిగాము. వాళ్ళు పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారు సూచించిన విధానంలో శిరిడీ సాయిబాబాను పూజించుకునేవారు. వారానికి ఒకరోజు సత్సంగం జరిగేది. మేము ఆ సత్సంగానికి హాజరయ్యేవాళ్ళము. మేము అప్పుడప్పుడు పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి నాగోలు వెళ్ళేవాళ్ళము. గురుకుటుంబం దర్శనం, వారి సత్సంగాలు విన్న తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారు రాసిన గ్రంథాలు చదివిన తరువాత, 'సరి అయిన ఆధ్యాత్మిక మార్గం యిదికదా!' అనిపించింది. మనసుకి ఊరట కలిగింది. కొన్నాళ్ళకి టి.వి.రావుగారి కుటుంబం కూడా నాగోలుకి షిఫ్ట్ అయ్యారు. మళ్ళీ మాకు చాలా బాధ అనిపించింది. ఇక మౌలాలీలో వుండబుద్ది కాక, మేము కూడా గురుకుటుంబము ఆశీస్సులతో నాగోలుకి షిఫ్ట్ అయిపోయాము.

ఆవిధంగా, శ్రీ రాఘవేంద్రస్వామివారి సేవ చేసుకున్నాము కాబట్టి, ఆ సేవ ఫలితంగా అపారమైన ఆధ్యాత్మికజ్ఞానాన్ని యిచ్చే తల్లిదండ్రులైన పూజ్యశ్రీ మాస్టరుగారు, అమ్మగార్ల బాటలోకి రాగలిగాము. ఇది 100% నిజం.

తరువాత శ్రీ మాస్టరుగారి రచనలు చదువుతూ శ్రీ ద్వారక బాబుగారి, శ్రీమతి వేదమ్మగారి ప్రసంగాలు వింటుంటే, శ్రీ సాయిబాబాపైన పూజ్యశ్రీ మాస్టరుగారి పైన బాగా ఇష్టం కలిగింది. అప్పటినుంచి అమ్మగారి అనుగ్రహం, బాబాగారి, శ్రీ మాస్టరుగార్ల అనుగ్రహం చూస్తూనే వున్నాము.

శ్రీ అమ్మగారు ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా మమ్మల్ని కష్టాల నుంచి గట్టెక్కించారు. మావారు తరచూ ఏదోరకంగా జబ్బు పడుతూ వుండేవారు. దానికి తోడుగా ఎక్కువ శాతం దుర్ఘటనలు జరుగుతూ వుండేవి. పూజ్యశ్రీ అమ్మగారి కృప మాపై ఎలా వర్షించిందో మీతో యిప్పుడు పంచుకుంటాను.

ఒకసారి మా ఆడబడుచుగారు కోరిన మీదట వాళ్ళ ఇంట్లో తోటని (Rooftop garden) ఏర్పాటు చేస్తూ, మావారు నీళ్ల కోసం మోటార్ వెయ్యగానే, దానికున్న వైర్లు సరిగా లేక కరెంటు షాక్ కొట్టి, పక్కనే వున్న గట్టు మీద వెల్లకిలా పడిపోయారు. నడుముకు బలంగా దెబ్బ తగిలింది. మావారు నిమ్స్ (NIMS) హాస్పిటల్లో ఉద్యోగం చేస్తారు. వెంటనే ఆ హాస్పిటలుకి తీసుకుని వెళ్ళాము. డాక్టర్ పరీక్ష చేసి, ఎల్-4, ఎల్-5, (వెన్నెముకకు సంబంధించినది) దెబ్బతిన్నాయని చెప్పారు. అంతేకాదు ఒక సంవత్సరమంతా బెడ్-రెస్ట్ తీసుకోవాలి అని కూడా చెప్పారు. ఇంక మా బాధ వర్ణనాతీతం. ఒక్కసారిగా పరిస్థితి యిట్లా తలక్రిందులుగా అయ్యేసరికి తట్టుకోలేకపోయాము. ఇక పూజ్యశ్రీ అమ్మగారే దిక్కని శరణు వేడుకున్నాము! ఈ పరిస్థితిని తట్టుకునే

శక్తినిమ్మని ప్రార్థించాము!! ఒక వారం తరువాత సమస్య చాలా వరకు సర్దుకుంది. నెమ్మదిగా నడవడం ప్రాక్టీస్ చెయ్యమన్నారు. తరవాత 15 రోజులకే డిశ్చార్జి చేసారు. అతికొద్ది రోజులు రెస్ట్ తరువాత తిరిగి డ్యూటీలో జాయిన్ అయ్యారు! ఇంత త్వరగా రికవర్ అయినందుకు అక్కడి డాక్టర్లు కూడా చాలా ఆశ్చర్యపోయారు! ఇది కేవలం అమ్మగారి దయ! పూజ్యశ్రీ అమ్మగారి లీలావైభవాన్ని గురించి యెంత చెప్పినా తక్కువే!!

పూజ్యశ్రీ అమ్మగారి సర్వజ్ఞత్వం తెలియచేసే మరో లీల మీతో పంచుకుంటాను. మావారు ప్రతిరోజూ కొన్ని తులసిదళాలు నిలయంలో సమర్పించుకునేవారు. అక్కడనించి వచ్చాక, ఆఫీసుకి వెళ్లేవారు. ఒకసారి ఈయన నిలయానికి వెళ్లి ఎంతసేపటికీ రాలేదు. ఆఫీసుకి టైం అయిపోతోంది. నాకు కొంచెం విసుగు, కోపం వచ్చాయి. కాస్సేపటికి ఈయన వచ్చారు. నేను ఎందుకు ఇంత ఆలస్యం అయిందని మావారిని బాగా విసుక్కున్నాను. ఆ మరునాడు ఈయన తులసిదళాలు సమర్పించుకుంటే స్వీకరించలేదట. ఈయన ఇంటికి వచ్చి చెబితే, నాకు చాలా బాధవేసింది. 'నావల్లే యిలా జరిగింది కదా' అని. దానితో పాటు పూజ్యశ్రీ అమ్మగారికి మన ఇంట్లో ఏమి మాట్లాడుకున్నా తెలిసిపోతుందన్న సంగతి బాగా అర్థమయ్యింది. వెంటనే క్షమించమని పూజ్యశ్రీ అమ్మగారికి హృదయ పూర్వకంగా నమస్కారం చేసుకున్నాను.

ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారు మావారిని ప్రాణాపాయ స్థితిలోనుంచి బ్రతికించి మాకు మళ్ళీ జీవితాన్ని ప్రసాదించారు. 2019 లో మావారికి హైబీపీ వచ్చి, ఆంజియోగ్రామ్ చేశారు. రిపోర్ట్స్ లో ఏ సమస్యా లేదని వచ్చింది. హమ్మయ్య అని ఊపిరి తీసుకున్నాము. కొన్నాళ్ల తరవాత ఒకరోజు సాయంత్రం వేళ నాకు నిమ్స్ హాస్పిటల్ నించి ఫోన్ వచ్చింది. మావారికి బాగా లేదని, నన్ను అర్జంట్ గా రమ్మని చెప్పారు! ఏమి జరిగిందో చెప్పలేదు, కాస్సేపటికి, కూడా ఎవరినైనా తోడు తీసుకుని రమ్మని మళ్ళీ ఫోను చేశారు! ఇక నాకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఇంట్లో ఎదురుగా పూజ్యశ్రీ అమ్మగారి, మాస్టరుగారి పటానికి 'దయ చూడండమ్మా' అని దణ్ణం పెట్టుకుని, పూజ్యశ్రీ అమ్మగారి నిలయానికి పరిగెత్తాను. అక్కడ సేవకులు ఒకరికి విషయం చెప్పి "అమ్మగారికి చెప్పండి. నన్ను ఒంటరిదాన్ని చేయకండని చెప్పండి" అని నిలయం గుమ్మానికి నమస్కారం చేసుకున్నాను. తర్వాత మా అన్నయ్యగారు వుంటే వారి కారులో ఆసుపత్రికి బయలుదేరాము. సగం దారి వెళ్ళగానే నాకు మళ్ళీ ఫోను వచ్చింది. నిజంగా పూజ్యశ్రీ అమ్మగారు ఏమి చక్రం అడ్డువేశారో ఏమో తెలియదు కానీ, 'కొంచెం నిమ్మదించింది కంగారు పడొద్దు' అని చెప్పారు.

నేను వెళ్ళాక తెలిసిన విషయం ఏమిటంటే, హై బి.పి, లో షుగర్ (high B.P., low sugar) వచ్చి, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు, డాక్టర్లు వచ్చి, ఎంత ప్రయత్నించినా లేవలేదట. ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్మెంట్ లో అడ్మిట్ చేసారట. అప్పుడు నాకు ఫోన్ చేశారు. నేను బయలుదేరిన కొంతసేపటికి తెలివి వచ్చిందిట! డాక్టర్లు పెద్ద ప్రమాదమే తప్పిందని అన్నారు. అలా మావారు మరో జన్మ ఎత్తినట్లే.

ఇప్పటికీ ఆయనకు high sugar fluctuation వల్ల, BP వల్ల మూత్రపిండాలు (kidneys) దెబ్బతిని డయాలసిస్ (dialysis) చేయించుకుంటూ, ఇంత తీవ్రమైన పరిస్థితిలో కూడా ఆయన యథావిధిగా డ్యూటీలకు వెళ్లి క్షేమంగా రాగలగుతున్నారంటే అంటే అది కేవలం శ్రీ అమ్మగారి కృపాకటాక్షం వల్ల మాత్రమే.

నన్నుకూడా చాలా ప్రమాదాలనించి కాపాడారు. కళ్ళకి, కాలికి, సమస్యలు వచ్చాయి, నాకు ఒకసారి కాలువిరిగి, ఇంచుమించు ఏడాది బెడ్ పైన వున్నాను. అసలు కాలు రావడమే కష్టం అన్నారు. నేను మళ్ళీ నడుస్తాను అనుకోలేదు. అలాంటిది, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి అపార కరుణతో, తిరిగి నడవగలుగుతున్నాను.

పూజ్యశ్రీ అమ్మగారు 2018 లో జగ్గయ్యపేట వెళ్ళి కొంతకాలం వున్నారు. ఆ సమయంలో ఒకసారి నేను జగ్గయ్యపేట వెళ్లాను. అక్కడ పొద్దున శ్రీ గురుచరిత్ర, సాయంత్రం శ్రీ సాయిలీలామృతం సప్తాహ పారాయణ ప్రారంభించాను. రోజూ నాలుగు హారతులు కూడా అక్కడే చేసుకునేదాన్ని. సరిగ్గా ఏడవ రోజు ఉదయం గురుచరిత్ర పారాయణ పూర్తి చేసుకుని గుమ్మానికి నమస్కారం చేసుకుని లేవగానే లోపల నుంచి సేవకులు వచ్చి "అమ్మగారు మిమ్మల్ని దర్శనానికి రమ్మంటున్నారు" అని నన్ను, మావారిని లోపలికి పిలిచారు. వారి ఆరోగ్య రీత్యా అప్పుడు దర్శనాలే వుండేవి కాదు. నాకు ఎంత సంతోషమయిందంటే అంటే అది మీ ఊహకే వదిలేస్తున్నాను. ఆ రోజు మావారు నన్ను తిరిగి హైదరాబాద్ తీసుకువెళ్ళటానికి జగ్గయ్యపేట వచ్చివున్నారు.

మేమిద్దరము పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి

***మిగతా 29వ పేజీలో***

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 12వ ప్రసంగము

### ఆనందమయ కోశము:

***కారణే సత్త్వమానందమయో మోదాది వృత్తిభిః I***

భావము : కారణ శరీరంలో సత్త్వగుణము మోదము మొదలైన వృత్తులతో కలిసి ఆనందమయ కోశ మనబడుతుంది.

అవిద్య, ప్రియము, మోదము, ప్రమోదము, అనే వృత్తులు ఆనందమయ కోశంలో ఇమిడి వుంటాయి. కోరుకున్న వస్తువును చూడడం వలన కలిగే సుఖమే 'ప్రియము'. ఇష్టమైన విషయము పొందడం వలన కలిగే ఆనందము 'మోదము'. అనుభవించడం వలన కలిగే సుఖము 'ప్రమోదము'.

*శ్లో॥ కాచిదన్తర్ముఖా వత్తిః*
*ఆనన్ద ప్రతిబింబభాక్ I*
*పుణ్యభోగే భోగశాంతౌ*
*నిద్రారూపేణ లీయతే II*

భావము : పుణ్యోపభోగ సమయంలో ఒకానొక అంతర్ముఖవృత్తి ఆనంద ప్రతిబింబాన్ని అనుభవిస్తుంది. ఈ అంతర్ముఖ వృత్తే భోగశాంతి సమయంలో నిద్రారూపంలో లయమౌతుంది. అది ఆనందమయ కోశము.

ఈ ఆనందమయ కోశము ఆత్మకాదు. ఎందుకంటే దానిలోని ఆనందము ఒకానొకప్పుడు అంటే పుణ్యోపభోగ సమయంలో, గాఢనిద్రలో మాత్రమే వుంటుంది. విద్యుత్తు యొక్క ప్రకాశం లాగా అది క్షణికమైనది. సుఖానుభవ విషయాలలో సుఖము మొదలైన విషయాల సంయోగం వుండేంతవరకు మాత్రమే వుంటుంది. ఆ పదార్థము మరుగవడంతోటే నశిస్తుంది. కానీ ఆత్మానందం నిత్యమైనది ఎప్పుడు ఒకే విధంగా వుంటుంది.

ఈ విధంగా అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలు ఐదూ ఆత్మజ్ఞానానికి వున్న ఆవరణము (చుట్టూ వున్నవి). వాటిలో ఏ ఒక్క గుణమూ కూడా ఆత్మలో వుండదు. ఆత్మ వీటన్నింటి కంటే గూడా వేరు. ఇలా అన్వయవ్యతిరేకాల చేత (అన్వయించుకోవడంలోని తేడాల ద్వారా) తెలిసికోవాలి.

*శ్లో॥ అన్వయ వ్యతిరేకాభ్యాం*
*పంచకోశ వివేకతః I*
*స్వాత్మానం తత ఉద్ధృత్య*
*పరం బ్రహ్మ ప్రపద్యతే II*

భావం : అన్వయవ్యతిరేకాల చేత పంచకోశ వివేచన చేసి వాటినుండి ఆత్మను పైకితీసి అధికారియైన జీవుడు పరబ్రహ్మాన్ని పొందుతాడు.

అన్నింటిలోనూ వుండడం (సర్వానువృత్తి) అన్వయము. దేనిలోనూ వుండకపోవటం (సర్వవ్యావృత్తి) దానికి

వ్యతిరేకమైనది.

ఆత్మ వ్యాపకమవడం చేత జాగ్రత్, స్వప్న, సుషుప్తి, సమాధి - ఈ నాలుగు అవస్థలలోనూ అది భాసిస్తుంది. కాబట్టి ఈ నాలుగు అవస్థలలోనూ ఆత్మాన్వయం వుంటుంది. అన్నమయకోశము మొదలైనవి దేశ, కాల, వస్తువులనబడే మూడు విధాలుగా విభజింపదగినవి కావడం చేత పై నాలుగు అవస్థలలోనూ భాసించవు.

స్థూలశరీరము స్వప్న, సుషుప్తి అవస్థలలో భాసించదు. కాబట్టి ఈ అవస్థలలో తేడా వుంటుంది. కానీ ఆత్మకు అన్వయముంటుంది. ఆ కారణంగానే అవి అన్నమయకోశము అనబడే స్థూల శరీరానికి భిన్నమైనవి.

మెలకువలో (జాగృతిలో) స్థూల శరీరము, ఆత్మ రెండూ వుంటాయి. స్వప్నస్థితిలో కలిగే స్వప్నాలు మెలకువస్థితిలో జ్ఞాపకముండటం వలన 'స్వప్నంలో ఆత్మ వున్నది' అని ఋజువౌతుంది. సుషుప్తిలో ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలనబడే సూక్ష్మశరీరము వుండదు. దానిలో మనస్సు, బుద్ధి మొదలైనవన్నీ లయిస్తాయి. కానీ మెలకువ రాగానే 'నేను చాలా నిద్రపోయాను, నిద్రలో నాకేమీ తెలియలేదు' అని సుషుప్తిలోని (నిద్రలోని) సుఖము, అజ్ఞానము జ్ఞాపకముంటుంది. ఆ అనుభవము కలిగినది ఆత్మ. సాక్షిరూపమైన భాసము స్ఫురించటం చేత నిద్రలో (సుషుప్తిలో) ఆత్మకు అన్వయము, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాల (లింగదేహము యొక్క) అభావము చేత వాటి వ్యతిరేకము వుంటుంది.

సమాధిస్థితిలో ఆత్మ స్ఫురించటమే అన్వయము. సుషుప్తిలో (నిద్రలో) భాసించే అజ్ఞానము స్ఫురించకపోవడం వలన ఆనందమయకోశ రూపమైన కారణ అజ్ఞానానికి అక్కడ వ్యతిరేకము.

ఆత్మ అన్నమయము మొదలైన కోశాలకు భిన్నమైనది. **సవా ఏష పురుషోఽన్నరసమయః** 'ఆ పురుషుడు అన్నరసమయుడు' అని మొదలుపెట్టి ***'తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాదన్యోఽన్తరాత్మా ప్రాణమయః'*** 'కాబట్టి ఆ అన్నరసమయానికి భిన్నమైన అంతరాత్మ ప్రాణమయమని, ***'అన్యోఽన్తరాత్మా మనోమయః'*** 'దానికి భిన్నమైనది మనోమయము' అని, ***'అన్యోఽన్తరాత్మా విజ్ఞానమయః'*** 'తద్భిన్నమైన అంతరాత్మ విజ్ఞానమయము' అని, ***'అన్యోఽన్తరాత్మాఽనందమయ'*** అందుకు భిన్నమైన అంతరాత్మ ఆనందమయమని తైత్తరీయ ఉపనిషత్తులో చెప్పబడింది. దాని తాత్పర్యము - అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలను ఆత్మకు భిన్నంగా అంగీకరింపజేయడం కాదు. జిజ్ఞాసువుకు సోపానక్రమముగా శుద్ధమైన ఆత్మను తెలియజేయడం మాత్రమే.

ఆత్మ అని దేనిని అంగీకరించాలి అనే విషయంలో భిన్న అభిప్రాయాలు వున్నాయి. విరోచనమతాన్ని అవలంబించేవారు స్థూలశరీరాన్ని ఆత్మగా అంగీకరించి ఈ వాదాన్ని చెబుతారు: 'అహంబుద్ధి అంటే అత్యంత ప్రియబుద్ధి కలిగేదే ఆత్మ. 'నేను మనిషిని, నేను బ్రాహ్మణుడిని' అనే వాటిలో ప్రీతికలిగే స్థానాలైన మనుష్యత్వ, బ్రాహ్మణత్వాలు స్థూలశరీరంలోనే భాసించడం చేత స్థూలశరీరమే అహంబుద్ధికి (అహంకారానికి) విషయము. స్త్రీ, పుత్ర, ధనాదులకు స్థూలశరీరంతోనే సంబంధం వుంటుంది. కాబట్టే వాటిపట్ల ప్రేమ కలుగుతుంది. దేని ద్వారా ఇతర పదార్థాల పట్ల ప్రేమ కలుగుతుందో ఆ స్థూలశరీరము అన్నింటికంటే ఎక్కువ ప్రియమైనదవడం వలన స్థూల శరీరమే ఆత్మ.'

కాబట్టి దానిని రకరకాల భోజనాలతోనూ, శృంగారాలతోనూ బలపరచాలి. అలంకరించాలి, అదే పురుషార్థము. అది తప్ప వేరే ఆత్మ లేకపోవడమే ఇందుకు కారణము.

కొంతమంది స్థూలదేహాన్ని కాక ఇంద్రియాలని ఆత్మగా అంగీకరిస్తారు. వారి సిద్ధాంతం ప్రకారము వేటి ద్వారా జీవన వ్యవహారం జరుగుతుందో, ఏవి లేకపోతే అది ఆగిపోతుందో అదే ఆత్మ. 'నేను చూస్తున్నాను, వింటున్నాను' మొదలైన అహంబుద్ధి ఇంద్రియాలందే వుండటం చేత ఇంద్రియాలే ఆత్మ.

కొంతమంది ఇంద్రియాలు కాక ప్రాణాలనే ఆత్మగా అంగీకరిస్తారు. మరణ సమయంలో శరీరంలో ప్రాణాలు వుంటే బ్రతికి వున్నాడంటాము. అలాగే ప్రాణాలు లేకపోతే చనిపోయాడు అంటాము. ఇంద్రియ వినాశము చేత మానవునికి ఆ ఇంద్రియ లోపాన్ని (అవిటితనాన్ని) మాత్రమే చెబుతారు. కళ్ళు లేకపోతే గుడ్డివాడని, చెవులు లేకపోతే (వినికిడి లేకుంటే) చెవిటివాడని మొదలైనవి. కానీ ప్రాణాలు లేని శరీరము అశుభకరము, భయంకరము అయిపోతుంది. ఇంద్రియాలనే ఆత్మగా అంగీకరించాలంటే 'నేత్ర స్వరూపుడినైన నేను చూస్తున్నాను, శ్రవణ స్వరూపుడనైన నేను వింటున్నాను' అనే ప్రతీతి కలగాలి. కానీ అలా కలగకుండా, 'నాకు కళ్ళు

వున్నాయి, నాకు చెవులు వున్నాయి' అని ప్రతీతి కలగడం చేత ఆత్మ ఇంద్రియాల కంటే భిన్నమైనది. అది ఋజువైన తర్వాత ఆ ఆత్మ ప్రాణాలనే అంగీకరించవలసి వస్తుంది.

కొంతమంది ప్రాణాలు జడమైనవి, అనాత్మ అని అంగీకరించి, మనసును ఆత్మగా అంగీకరిస్తారు. మనస్సు ఇంద్రియజ్ఞానానికి, సకల వ్యవహారాలకు, బంధమోక్షాలకు కారణమవడం చేత అదే ఆత్మ. అందుకు భిన్నమైన ఆత్మ లేదు.

క్షణిక విజ్ఞానవాదులైన బౌద్ధులు బుద్ధిని ఆత్మగా భావిస్తారు. ఇది వారి వాదము –

పదార్థాలన్నీ విజ్ఞానం యొక్క ఆకారాలు. ఈ విజ్ఞానము ప్రకాశ రూపము. ప్రతిక్షణంలోను విజ్ఞానము ఉద్భవిస్తుంది, నశిస్తుంది. ప్రథమ విజ్ఞానము లాగానే ద్వితీయ విజ్ఞానము జన్మించిన వెంటనే (కలిగిన వెంటనే) ప్రథమ విజ్ఞానము నశిస్తుంది. అలాగే మూడవ విజ్ఞానము పుట్టుక రెండవ విజ్ఞానపు నాశము, నాలుగవ విజ్ఞానము యొక్క పుట్టుక మూడవ విజ్ఞానము యొక్క నాశము అవుతుంది. ఇలాగే నదీ ప్రవాహం లాగానే విజ్ఞానధార ప్రవహిస్తుంది. ఈ విజ్ఞానధార 'ఆలయ విజ్ఞానధార', 'ప్రవృత్తి విజ్ఞానధార' అని రెండు రకాలు. 'అహం' అనే జ్ఞానం ఆలయ విజ్ఞానధార అని, 'ఇది కుండ' అనే జ్ఞానము ప్రవృత్తి విజ్ఞానధార అని అంటారు.

ఆలయ విజ్ఞానధార నుంచి ప్రవృత్తి విజ్ఞానధార పుడుతుంది. మనస్సు యొక్క స్వరూపము ప్రవృత్తి విజ్ఞానధారలో వున్నది. కాబట్టి మనస్సు ఆలయ విజ్ఞానధార రూపమైన బుద్ధి యొక్క కార్యము. ఆ బుద్ధియే ఆత్మ. ఇలా బుద్ధిని క్షణికరూపముగాను, స్వయంప్రకాశమైనదిగాను స్వీకరించి దానిని ఆత్మగా చెబుతారు.

పూర్వమీమాంస వ్యాఖ్యాత అయిన భట్టుని అభిప్రాయము ప్రకారము ఆనందమయ కోశము ఆత్మ. మెరుపులాగా ఆత్మ క్షణికమైనది కాదు. స్థిరమైనది. అది జడ చేతన రూపము. సుషుప్తి (నిద్ర) నుంచి లేచిన మానవుడు నేను జడత్వాన్ని పొంది నిద్రపోయానని చెబుతాడు. కాబట్టి ఆత్మ జడరూపము (జడమైనది). మెలకువ వచ్చిన తరువాత తన అవస్థ(నిద్రావస్థ) గురించిన జ్ఞానం కలుగుతుంది. ఆత్మ స్వరూపము తప్ప మరొక జ్ఞానసాధనము సుషుప్తిలో (నిద్రలో) లేదు. సుషుప్తి (నిద్ర)లోని స్మృతికి కారణము జ్ఞానము. ఆ జ్ఞానమే ఆత్మస్వరూపము. ఇలాగే ఆత్మ మిణుగురు పురుగులాగే ప్రకాశ, అప్రకాశరూపము. ఆనందమయ కోశము కూడా ప్రకాశ, అప్రకాశ రూపమే. ఎందుకంటే సుషుప్తి(నిద్ర)లో చేతనాభాససహిత అజ్ఞానము ఆనందమయకోశము. అందులో ఆభాసము ప్రకాశరూపంలోనూ, అజ్ఞానము అప్రకాశరూపంలోనూ వున్నాయి. కాబట్టి ఆనందమయ కోసమే ఆత్మ.

శూన్యవాదులైన మధ్యమార్గానికి అనుయాయులైన బౌద్ధులు శూన్యాన్నే ఆత్మగా భావిస్తారు. ఆత్మ నిరంశము (ఎట్టి అంశాలు లేనిది). అది ప్రకాశరూపము కాదు. అప్రకాశరూపము కూడా కాదు. ఆత్మను ప్రకాశ, అప్రకాశ రూపమని చెప్పినట్లయితే అది సాంశమని (అంటే అనేక అంశాలతో కూడినదని) ఒప్పుకోవలసివస్తుంది. సాంశములైన కుండలాంటి పదార్థాలను మనము చూస్తున్నాము కదా! అవి ఉత్పత్తి, నాశములు కలవి.

కాబట్టి ఆత్మకు కూడా ఉత్పత్తి (పుట్టుక), నాశాన్ని ఒప్పుకోవాలి. ఉత్పత్తి నాశాలు కల పదార్థాలకు పుట్టుకకి పూర్వము, నాశము తర్వాత అస్తిత్వము వుండదు. కాబట్టి అవి 'అసత్' అనబడతాయి. ఆద్యంతాలలో అసత్ అయినవి మధ్యలో కూడా అసత్ పదార్థాలే. ఈ విధంగా జగత్తులోని పదార్థాలన్నీ ఆసత్ లే! అలానే ఆత్మ ప్రకాశ, అప్రకాశ రూపమవడం చేత సాంశము. కాబట్టి ఉత్పత్తి, అంతము కలది. కాబట్టి 'అసత్'. ఇలా ఆత్మ, అనాత్మ అన్నీ అసత్ రూపము కలిగి వుండటం చేత శూన్యమే పరమతత్త్వము.

వారు అజ్ఞానరూపమైన ఆనందమయ కోశాన్ని ప్రతిపాదిస్తూ అజ్ఞానము మూడు విధాలుగా వుంటుందని అంగీకరిస్తారు. అది ఎలాగంటే:–

1. అద్వైతశాస్త్రసంస్కారము లేనివారు అజ్ఞానము జగత్తురూపమైన పరిణామాన్ని పొందిందని అంగీకరిస్తారు.

2. అద్వైత శాస్త్రజ్ఞులైన విద్వాంసులకు అజ్ఞానము, దాని కార్యమైన జగత్తు సత్ అసత్ లే లేని అనిర్వచనీయరూపమైనదిగా గోచరిస్తుంది.

3. జ్ఞాననిష్ఠను పొందిన జీవన్ముక్తుడైన విద్వాంసునికి కార్యముతో కూడిన అజ్ఞానము తుచ్ఛమైనదని అవగతమౌవుతుంది.

ఈ తుచ్ఛము, అసత్, శూన్యము - ఇవి ఒకే అర్థం కలవని చెప్పే శూన్యవాదులు జీవన్ముక్తునికి తుచ్ఛరూపంలో అజ్ఞానప్రతీతి కలగడంలో గల పరమ పురుషార్థాన్ని

***మిగతా 16వ పేజీలో***

# జనార్దన్ గల్వంకర్

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

మొదటి సాయి చరిత్రకారుడైన హేమాద్పంతుకు అల్లుడు యశ్వంత్ జనార్దన్ గల్వంకర్. ఇతడు బొంబాయి సెక్రటేరియేట్ లోని హోమ్ శాఖలో సూపరింటెండెంటుగా పని చేస్తుండేవాడు. హేమాద్పంతు శిరిడీ దర్శించ నారంభించాక సహజంగా తన అల్లుని యోగక్షేమాలు కోరి అతనిని నాలుగైదుసార్లు తనతో సాయి దర్శనానికి తీసుకుపోయాడు. మొదటి కొద్దిసార్లూ సాయిని దర్శించినా గల్వంకర్ కు మాత్రం ఆయనపట్ల భక్తిశ్రద్ధలంతగా కల్గలేదు. కాని తమ పిలుపు, భగవంతుని ఆజ్ఞ లేక ఎవరూ శిరిడీకి రాలేరని సాయి అన్నారు గదా! అందువలన ఆయనే అతని అంతరంగంలో క్రమంగా పరిణతి తీసుకొచ్చారు. (అలా అతనిపట్ల సాయి ప్రత్యేక శ్రద్ధవహించడానికి కారణమేమో అతడికి తెలియకపోయినా, సాయికి తెలుసు. ఆ విషయం ఆయన చెప్పారు గూడ).

ఒకసారి ఆయన అతనికి స్వప్నంలో కనిపించి అతనిని ₹2/-లు దక్షిణ కోరారు. మరొకసారి గూడ ఆయన కలలో కనిపించి అతనికి రెండు ఆదేశాలిచ్చారు. “నీవు నీతి, నిజాయితీతో (ఉద్యోగంలో) వ్యవహరించాలి” అన్నది ఒకటి; మంచి శీలము, ధర్మబద్ధమైన దాంపత్యమూ పాటించాలన్నది రెండవది. నిజానికి ఆ రెండు స్వప్నాదేశాలకు అర్థం – అతడు నిష్ఠ ఓరిమిలతో యీ రెండు నియమాలు పాటించాలనే. అతడు చిత్తశుద్ధితో అలానే చేయగల్గాడు గూడ. ఇంతకంటే ఏ సద్గురువైనా చేయగల మేలు యింకొకటి ఏముంటుంది? లౌకికమైన కష్టాలు, కోర్కెలూ ఎన్ని తొలగించినా యిలాంటి నైతిక పరివర్తన రాకుంటే మనం పొందేదేదీ వుండదు. మనలోని నైతిక బలహీనతల వలన మరలా అంత దుఃఖము, కష్టమూ కల్గించగల పాపాలు చేస్తూనే వుంటాము. ముందు జన్మలలో వాటిని విధిగా అనుభవించవలసి వచ్చినపుడు — అవి యిప్పుడెంత కష్టంగా వున్నాయో అంత కష్టంగానూ అప్పుడూ వుంటాయి. ఇప్పుడు ప్రత్యేకమైన యత్నంతో, వివేకంతో గూడిన యోచనతో మన బలహీనతలు తొలగించుకొనే యత్నం మనమీ జన్మలో చేయకుంటే అలా చేసే సంస్కారం (మానసికమైన అలవాటు) మరుజన్మలలో గూడా మనకు కల్గదు. ఆ ప్రయత్నం యిప్పుడెంత కష్టంగా వుంటుందో, ముందు జన్మలలో గూడ అంత కష్టంగానూ వుంటుంది. అలాగాక యీ జన్మలో శక్తివంచన లేకుండా మన బలహీనతలను తొలగించుకొనే యత్నం చేస్తే – అలా యత్నం చేసే సంస్కారం మరుజన్మలో మనతో కూడా వచ్చి, అపుడా ప్రయత్నం యిప్పటికంటే సులభమవుతుంది. జనార్దన్ గల్వంకర్ అలాటివాడు గనుకనే సాయి యీజన్మలో ఒక్కసారి హెచ్చరించగానే చిత్తశుద్ధితో అట్టి ప్రయత్నం చేసి సఫలుడయ్యాడని మనం తలచవచ్చు. అందుకొక ఆధారం గూడా వున్నది.

ఒకసారి సాయియే యితర భక్తులతో – గల్వంకర్ గత జన్మలనుండే నిజాయితీ, పవిత్రత గలవాడని చెప్పారు. తర్వాత ఆ భక్తులే ఆ విషయం అతడితో చెప్పారు. అలా అయితే బాబా అతనినీ జన్మలో అలా మరలా హెచ్చరించవలసిన అవసరమేమిటన్న ప్రశ్న రావచ్చు. ఒక్కొక్క సద్గుణంగాని, దుర్గుణంగాని స్థిరపడటానికి కొన్ని జన్మలు పడుతుంది. ఒక సద్గుణం అప్పుడప్పుడే మనలో ఏర్పడుతున్న దశలో, జన్మించిన ప్రతిసారీ సుఖాలను కోరే స్వభావం గల యింద్రియాలు, మనస్సుల ప్రభావం వలన మరలా మనం

బాహ్య ప్రభావాలకు లోనై మనలో బలహీనతలు ఏర్పడి బలపడే ప్రమాదముంటుంది. అపుడు సద్గురువు మనలను హెచ్చరిస్తారు. దానిని అమలు పెట్టే మన ప్రయత్నానికి వారి అండ వుంటుంది. వారిపై మనకుగల భక్తిశ్రద్ధలు తోడై బలపరుస్తాయి.

ఇలా అంటే సాయి స్వప్నంలో కనిపించి యిలా ఆదేశించని వారమంతా ఆ సద్గుణాలను యిదివరకే సాధించుకున్నవారమని భ్రమ పడకూడదు. అదే నిజమైతే యీ జన్మలో మరలా సద్గురు సేవ – మహల్సాపతి, పురందరే, రేగేవంటి వారికి లభించినట్లే మనకూ లభిస్తుంది. మన నడవడి యెవరూ మన ఎదుటకువచ్చి విమర్శించలేనిదిగా వుంటుంది – పరోక్షంగా అసూయతో వారెన్ని అనుకున్నా. సాయి మనకీ జన్మలో యిలా దర్శనమిచ్చి హెచ్చరించక పోవడానికి ప్రధాన కారణం – మనలో అట్టి ప్రయత్నం గూడ గత జన్మలలో ఆరంభం కాలేదన్నమాట. ఆయన హెచ్చరిక చేసినా దానిని విశ్వాసంతో ఆచరించే దశలో మనం లేనట్లే. అందుకొక్కటే గుర్తు. ఈనాడు సాయిచరిత్ర, బోధ చదువుకొంటుంటే ప్రత్యక్ష భక్తులందరికీ ఆయన ఎలాటి హెచ్చరికలు చేసారో తెలుస్తుంది. వాటిని వెంటనే వారి ఆదేశంగా తలచి మనం వాటిని పాటించే తీవ్రయత్నం చేయలేకపోతాము. అలాంటప్పుడు ఆయన మనకేమి ఆదేశించినాప్రయోజనమేమున్నది?వారిఆజ్ఞఉల్లంఘించిన దోషులవడంతప్ప? అందుకే ఆయనేమీ చెప్పరు. ఈలోగా ఆయన తమ లీలలతో మనలో విశ్వాసం కల్గించి, అట్టి కృతజ్ఞత – విశ్వాసాలతో వారి ఆదేశం పాటించే యత్నం మనలో ఆరంభమయ్యేలా చేస్తారు. కాని మనం ఒక పట్టాన ఆ మార్గంలోకి రాము. మన పిల్లల మేలు గోరి వారిని బడికి పంపాలని మనం చూస్తుంటే మన పిల్లలు బడి కెళ్తామనే ఆశజూపి మననుండి తాము కోరినవన్నీ పొందచూచి, విద్యాభ్యాసం మాత్రం ఎగ్గొట్ట చూచినట్లే, మనమూ చేస్తాము. మనం కోరినదల్లా ఆయన నెరవేర్చకుంటే ఆయనపై నమ్మకం విడుస్తాము. ఆయనను బెదిరిస్తుంటాము; అక్కసుతో అలా చేస్తుంటాము గూడ, ఇదంతా నేటి మానవుల గురించి సాయి ఎంతో బాధగా అనుకున్న మాటలలో – ఖాపర్డే డైరీలోనివి నిరూపణవుతాయి.

ఆయనే మరొకప్పుడు భక్తులు తమకు సమర్పించిన పనికిరాని నాణేలు – అరిగిపోయినవి, నక్కుపోయినవి, చెల్లనివి – చూచి, "నావద్దకన్నీ యిలాంటివే వస్తున్నాయి, ఏం చేస్తాం?" అన్నారు. ఆ కాసులు మన హృదయాలకు సంకేతాలన్నమాట. అలానే ఆయనపై విశ్వాసంలేక ఊరికే చోద్యం చూడవచ్చిన సేష్టన్ మాష్టర్ ఎదుట ఆయన మశీదులోని కుండలలో నీరు పారబోసి, కుండలు బోర్లిస్తున్నారు. అతడు కారణమడిగితే – "ఏం చేస్తాం? నావద్దకొచ్చే కుండలన్నీ తలక్రిందులుగానే వస్తున్నాయి" అన్నారు. ఆయనకు మన పైగల ప్రేమను, ఆయనలోని సర్వసమర్థతను, జ్ఞానాన్ని గుర్తించి వారి బోధను మన హృదయాలనే కుండలలో నింపుకోడానికి సిద్ధంగా ఎక్కువమంది వుండరని వారి భావం. ఈ మహత్తర సత్యం అర్థం చేసుకోకుంటే అంతటి మహనీయులైన సాయి సన్నిధిలో హరి వినాయక్ సాఠే వంటివారు ఆవేదనతో వర్ణించినంతటి దౌష్ట్యం పాదుకొని, తాత్కాలికంగానైనా ఆ సన్నిధిని ఎలా కలుషితం చేయగల్గుతుందన్నదో అర్థంగాదు. దీనినే మామిడిపూత పండ్లవడం ఉదాహరణగా తీసుకొని తమను జన్మ సార్థకమయ్యేదాకా అంటి పెట్టుకుని అనుసరించగలవారెప్పుడూ కొద్దిమందే వుంటారని వారు జోగ్ తో ఒకసారి చెప్పారు.

ఇలా జనార్దన్ యశ్వంత్ గల్వంకర్ తన శాయశక్తులా ప్రయత్నించి గత జన్మలోని తన సౌశీల్యాన్ని, పవిత్రతనూ తిరిగి సాధించుకున్నాకనే అతడికి సాయినుంచి దాని ఫలితమైన ఆశీర్వచనం గూడా లభించింది. అతడు 1917లో శిరిడీ వెళ్ళేప్పుడు వెనుకటివలెగాక, బాబాపై పూర్ణ విశ్వాసంతో వెళ్ళాడు. సాయి చెప్పిన సౌశీల్యము, సద్వర్తనము సాధించుకొన్నవారికే వారి పూర్ణ ఆశీస్సు లభిస్తుందనడానికి యిదే గుర్తు. అందుకే సాయి అతని తలపై చేయి పెట్టి ఆశీర్వదించారు. ఆ దివ్య స్పర్శకు జనార్దన్ గల్వంకర్ కు దివ్యమైన పారవశ్యం కల్గింది. అతడికి బాహ్య ప్రజ్ఞే లేకుండా పోయింది. ఆ సమయంలోనే ఆ ప్రక్కనున్న భక్తులతో అతడి పూర్వజన్మల గురించి బాబా చెప్పిన విషయాలన్నీ అతడికి తిరిగి బాహ్య ప్రజ్ఞ కల్గాక ఆ భక్తులు గల్వంకర్ తో చెప్పారు. అంతేగాదు – అతనిని యీ జన్మలో యీ తల్లి గర్భంలో తామే వుంచామని గూడ సాయి చెప్పారు. చిత్రగుప్తుడు, యమధర్మరాజు గూడ వారి ఆదేశానికి బద్ధులే గాబోలు! ఈ స్పర్శ గల్వంకర్ లో శాశ్వతమైన మార్పు తెచ్చింది. అపుడు బాబా, "సాయి అంటే యీ మూడున్నర మూరల ఎత్తున్న భౌతిక శరీరం మాత్రమే గాదు; మేమే సర్వత్రా వున్నాము. నన్ను సర్వత్రా దర్శించగల్గడం భక్తులు నేర్చుకోవాలి" అన్నారు.

సాయి చెప్పిన ఆ మాటలే గల్వంకర్ పట్ల ఆశీస్సులుగా పరిణమించాయి. అంతకుముందు పరమార్థానికి అంత ప్రాముఖ్యమివ్వని అతనికి సాయి తమ దివ్యప్రేరణ, స్పురణ ప్రసాదించి, అతనిచేత భగవద్గీత, ఏకనాథ భాగవతము మొ॥న ఆధ్యాత్మిక గ్రంథాలెన్నో చదివించారు. దానివలన ఆయన చెప్పిన మాటలు అతని హృదయంలో దృఢంగా నాటుకున్నాయి. అవన్నీ వారివాక్యాల దివ్య లీలల వివరణలే గదా! అటు తర్వాత గల్వంకర్ మానవ సహజమైన యిష్టాయిష్టాలకు, అభిప్రాయాలకూ ప్రాధాన్యమివ్వక సాయి ఉపదేశానికే ప్రాధాన్యమిచ్చి, తానున్నచోటే, తన ఉద్యోగ విధులలోనే సాయిని, వారి ఆదేశాన్ని దర్శించాడు. అతని ఉద్యోగ విధులన్నీ సాయి ప్రబోధామృతాన్ని ఆచరణలో పెట్టే చక్కని అవకాశాలనీ, లౌకిక జీవితమే ఆయన చెప్పినవి అభ్యసించడానికి సరైన రంగస్థలమనీ అతడు గుర్తించాడు.

ప్రత్యక్షంగా సాయి ఎదుట నున్నపుడు ఎలాటివారైనా సరిగా నడుచుకోజూస్తారు. వారినుంచి పరోక్షంగా వున్నామనుకొన్నప్పుడే – సూర్యుడు లేనిచోట అంధకారం అలముకున్నట్లు మనలోని రాక్షస ప్రవృత్తులన్నీ తలెత్తుతాయి. వాటి తాకిడిలో సాయి ఉపదేశం గుర్తురాదు; వచ్చినా మనలోని వెనుకటి దుష్టవాసనల ప్రభావం వలన, వాటిని మనం ప్రక్కకు నెట్టేసుకుంటాము. అందుకెన్నో సాకులు, సమర్థింపులు చేసుకుంటాము. కర్మ ఫలదాతకు మన సాకులు, సమర్థింపులతో పని వుండదు. అతడు మన హృదయసాక్షి గూడ. మన ఉద్దేశాలు, పనులూ... వీటిని బట్టి యిక చెరగని రీతిన తన శిలా శాసనం చెక్కి మన కర్మఫలం సిద్ధం చేస్తాడు. ఇతరులకు తెలియకున్నా మన చేతల వెనుక దాగియుండి, వాటిని ప్రేరేపించే మన సంకల్పాలను మన హృదయం నుండి మాత్రం మరుగుపరుచుకోలేము. మనలోవుండి అలా వాటిని తెలుసుకునే సాక్షి చైతన్యమే ఆ కర్మఫల ప్రదాత. ఒకసారి మరణించి, మరలా జన్మించే మధ్యకాలంలో మనలోని కర్మసాక్షియే మనకన్నీ విధిస్తాడు. మరొక రకంగా చెప్పాలంటే మనపై మనం విధించుకొనే శాసనమే అది. కనుకనే దానినెవరూ తప్పించలేరు. తమలోని యీ సంకల్పాన్ని సద్గురువుకు సర్వ సమర్పణం చేసినవారి మరుజన్మలపైన మాత్రమే సద్గురువు ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తారు. మిగిలినవారి సంగతి పక్షపాత మెరుగని కర్మసూత్రమే చూచుకొంటుంది. ఇది తెలిసే జనార్దన్ గల్వంకర్ వీలైనంత తరచుగా సాయికి భౌతికంగా దగ్గరయ్యే యత్నం చేయక, సర్వగతమైన సాయి సన్నిధిని తన హృదయంలో దృఢంగా ప్రతిష్ఠించుకొని, శరీరాన్ని తన ఉద్యోగధర్మంలో నిమగ్నం చేసాడు. సాయి అతనిచేత శ్రీరాముడు ఆచరించి చూపిన, శ్రీకృష్ణుడు భగవద్గీతలో బోధించిన కర్మయోగాన్ని ఆచరింపచేసారు. అట్టి సద్గురువే మనచేత ఆయా సాధనలు చేయించవలసిదేగాని, మనంగా వాటిని పూర్తిగా అనుష్టించలేము. కారణం మనచేత తప్పుడు పనులు చేయించే మనస్సే, అటు తర్వాత దానిని నిగ్రహించే రక్షకుడవడమెలా సాధ్యం? దానిని గురువు పరం చేస్తే ఆయనే దానిని నిగ్రహించి రక్షకుడిగా పని చేసేలా చూస్తారు. మన యిష్టాయిష్టాలకు, తాత్కాలికమైన పరిస్థితులకూ తల ఒగ్గక వారిపై విశ్వాసంతో, ఆ మార్గంలో మన కెదురయ్యే కష్టనష్టాల మధ్య ఓరిమితో యథాశక్తి వారాదేశించిన మార్గాన్ని అనుసరించ యత్నించడమే మన మనస్సును ఆయన పరం చేసే మార్గం. అదే ఆయనకు నిజంగా దక్షిణ సమర్పించడమన్నా, మన రెండు చేతులూ జోడించి నమస్కరించడమన్నా, లేక వారి రెండు పాదాలూ పట్టుకొనడమన్నా!

కాకుంటే వయస్సులో గల్వంకర్ చిన్నవాడవడంవలన యిదంతా అతడు యింత వివరంగా తెలుసుకున్నట్లు తోచదు. తెలిసినది ఆచరించడంలో నిమగ్నమైన వారికి ఆచరణ గురించి మాట్లాడ్డానికెలా సాధ్యపడుతుంది? సముద్రంలో ప్రాణాలొడ్డి యీత కొడుతున్నవాడు యీత గురించి, తన ప్రతిభ గురించీ ఉపన్యసించగలడా? ఈత గురించి గ్రంథాలనుండి సంపాదించిన పరిజ్ఞానం అపుడు ప్రదర్శించగలడా? అందుకే ఆధ్యాత్మ విద్యలో పూర్తిగా తెలిసిన వారెవ్వరూ తాముగా ఏమీ ఎవరికీ ఉపదేశించలేరు. వారి ఆచరణే మనకుపదేశమివ్వాలి. ఉపదేశించడంలో నిమగ్నమయ్యేవారికి ఆచరించడానికి సమయమూ, అవకాశమూ వుండవు. విలువైన జీవిత ఘడియలు కాలగర్భంలోకి జారిపోతుంటాయి. కాని వారికి లోకాన్ని మెప్పించజూడడంతోనే సరిపోతుంది. తమ హృదయాంతర్వర్తి, సర్వసాక్షి అయిన సద్గురువును మెప్పించే అవకాశమేరాదు. అందుకే బాబా సన్నిధి – జహ్వార్ ఆలీని అనేక మిషలమీద ఎలాగో వారి నుండి దూరంగా విసిరివేసింది.

సాయి దయ వలన జనార్దన్ గల్వంకర్ అలాంటివాడు కాలేదు. ఎల్లెడలా సాయిసన్నిధినే దర్శించే స్పృహతో వున్నాడు. అందుకే సాయి మహాసమాధి చెందాక గూడ అతడు ఆధ్యాత్మికంగా యింకా పురోగమించడానికి

అవసరమైన అనుభవాలు అతడికి ప్రసాదిస్తూనే వున్నారు. ఉదాహరణకు : 1921లో అతడు సకుటుంబంగా కాశీ, ప్రయాగ వెళ్ళి అక్కడ భరద్వాజాశ్రమంలో కూర్చొని తనకు మహాత్ముని దర్శనం ప్రసాదించమని సాయిని ప్రార్థించాడు. అక్కడ నుండి బయల్దేరిన కొద్ది నిముషాలకే రోడ్డు ప్రక్కన ఒక మహాత్ముడు కనిపించాడు. ఆయన 7 సం॥లకొకసారి దప్ప అక్కడికి రారని, ఎవరినీ తమచెంతకు రానివ్వరనీ, ఎవరివద్దా దక్షిణ అసలే తీసుకోరనీ అచటివారు చెప్పారు. కాని ఆయన గల్వంకర్ ను చూస్తూనే ఎంతో ప్రేమతో తమ చెంతకు పిలిచి అతడి జేబులోవున్న మూడు అణాలూ దక్షిణగా సమర్పిస్తే స్వీకరించారు గూడా! ఆయన రూపంలో గూడ అతనికి సాయియే పలికారు. అలానే 1932లో ఒకరోజు గల్వంకర్ కు సాయి స్వప్నంలో కన్పించి, "నీకేమి కావాలి?" అనడుగుతే, అతడు, "నాకు దివ్యప్రేమ మాత్రమే కావాలి" అని చెప్పాడు. బాబా, "నీకది లభిస్తుంది" అని చెప్పి అదృశ్యులయ్యారు. అప్పటినుండి అతనికెప్పుడూ దివ్య ప్రేమ, పారవశ్యం కల్గుతుండేది. అతడిలో పరిపాకమెంత కల్గిందో! సాయిని దర్శించాక గూడ ఆయనపై మొదట శ్రద్ధ కల్గని అతనిలో సాయి ఎంత పరిపాకం కల్గించారో! అదే సాయి సన్నిధి ప్రభావం!! ●

# వార్తాలాపము

12వ పేజీ తరువాయి

తెలుసుకోలేక అజ్ఞానరూపమైన ఆనందమయ కోశానికి అజ్ఞానరూపత్వాన్ని, శూన్యత్వానికి మహత్వాన్ని ఆపాదించి శూన్యమే ఆత్మని భావిస్తారు.

పూర్వమీమాంసకులైన ప్రభాకరులు, నైయాయికులు శూన్యాన్ని కాక ఆనందమయకోశాన్ని ఆత్మ అంటారు (గౌతమ ముని రచించిన న్యాయసూత్రాల ఆధారంగా నిశితంగా పరిశీలించి ఆస్తిక దర్శన విషయాలను నిర్ధారించే వారిని నైయాయికులు అంటారు) శూన్యానుభవం కలగడం చేత ఆత్మ శూన్యము కంటే విలక్షణమైనది. ఆత్మతో మనస్సు సంయోగం చెందడం చేత జ్ఞానము కలుగుతుంది. జ్ఞానమనే గుణం వుండటం చేత ఆత్మ జడమైనా చేతనమనబడుతుంది. విజ్ఞానమయకోశములోని బుద్ధి ఆత్మయొక్క గుణమైన జ్ఞానము.

వారు దీనిని కూడా అంగీకరిస్తారు. "ఆనందమయకోశంలో చేతనము గుప్తంగా వుంటుంది. అది వివేకహీనునికి అర్థంకాదు. సుషుప్తిలో (నిద్రలో) జ్ఞానము కూడా లేకపోవడం చేత ఆత్మ జడమైనది. కానీ గూఢచేతనమైన ఆనందకోశమే ఆత్మ. బుద్ధి దాని గుణము".

ఈ మతాంతరాలన్నీ జిజ్ఞాసువును గందరగోళపరుస్తాయి. వివేకవంతుడు వాటిని వదిలివేయడం మంచిది. శృతి, యుక్తి, అనుభవము – వీటిని ఆధారంగా తీసుకొని ఆలోచిస్తే ఆత్మతత్త్వము పంచకోశాలకంటే భిన్నమైనదని తెలుస్తుంది. ఈ నిశ్చయంతో దానిని పొందేందుకు ప్రయత్నించడం మంచిది.

డా.లల్లూభాయి : పంచకోశాలకు అతీతమైన ఆత్మను తెలుసుకోవడానికి సాధనమేమిటి? ఎలా తెలుసుకోవాలి?

స్వామి నిత్యానంద : ధ్యానయోగం చేత పరమాత్మను తెలుసుకోవచ్చు.

డా॥ల॥ : ఎవరిని ధ్యానించాలి?

స్వా॥ని॥: పరమాత్మను ధ్యానించాలి.

డా॥ల॥ : గురువును ధ్యానించవచ్చా?

స్వా॥ని॥: గురు దృక్పథంతో రాముడు కృష్ణుడు మొదలైన మూర్తులను ధ్యానించడం మంచిది.

డా॥ల॥: రాముడు కృష్ణుడు ఈ కాలానికి చెందినవారు కాదు. గురువులు ఈ కాలంలో కూడా ప్రత్యక్షంగా కనిపిస్తున్నారు. వారిని ధ్యానించకూడదా?

అప్పుడు నిత్యానంద స్వామి వారు ప్రకాశానంద స్వామి వారిని సమాధానం చెప్పమన్నారు

స్వా॥ప్ర॥: స్వామివారు సరిగ్గా చెప్పారు. గురుదృక్పథంతో రాముడు, కృష్ణుడు మొ॥న అవతారమూర్తులను ధ్యానించడం చాలా మంచిది.

డా॥ల॥ : మా గురువులు సాక్షాత్తు 25వ అవతారమని, రాముడు, కృష్ణుడు మొ॥నవారు భూతకాలపు వారని (పురాతనకాలం నాటి వారని) గురువులు వర్తమానకాలం వారని (ఇప్పటికాలం వారని), వారిని ధ్యానించడం సరైనదని మా స్నేహితులు చెబుతారు.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

శ్రీమతి శ్రీదేవి

ఆ రోజులలో రమణాశ్రమ ప్రాంతమంతా నిర్మానుష్యంగా వుండేది. జనసంచారమే లేని ఆ ప్రదేశంలో ఆశ్రమ, మందిర నిర్మాణాలు జరగడంతో అమ్మ దర్శనం కోసం, దైవదర్శనం కోసం క్రమక్రమంగా భక్తుల రాక పెరుగసాగింది. ఆ మధ్యకాలంలో అమ్మ అనారోగ్యం పాలవటంతో చాలా రోజులు భక్తులకు అమ్మ దర్శనం లభించలేదు. అమ్మకు కొంత ఆరోగ్యం చేకూరగానే ఎప్పుడెప్పుడు అమ్మ దర్శనం లభిస్తుందా అని ఎదురుచూస్తున్న భక్తులంతా ఒక్కసారిగా తండోపతండాలుగా అమ్మ దర్శనార్థం రమణశ్రమానికి వస్తుండడంతో రమణాశ్రమ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. జన సందోహంతో ఆ ప్రదేశమంతా కళకళలాడ సాగింది.

అమ్మకు వ్యాధి నెమ్మదించినా కొంత నీరసంగా, బలహీనంగా వుండటంతో అమ్మ దగ్గర వుండి పరిచర్యలు చేయటానికి, సమయానికి ఆహార పానీయాలు అందించటానికి రాజమోహన్ అనే భక్తుని భార్య రోజంతా అమ్మ దగ్గరే వుండి అమ్మను సేవించుకొనసాగింది. తన ఇంట్లో అనారోగ్యంతో వున్న తన చిన్న పిల్లలను కూడా వదిలిపెట్టి ఉదయం నుండి సాయంత్రం వరకు అమ్మ చెంతనే వుండేది. ఇంకా ఎందరో భక్తులు అమ్మకు నోటికి హితకరంగా వుండాలన్న ఉద్దేశంతో ఊరగాయ పచ్చళ్ళు, పాత చింతకాయ పచ్చడి, పుల్లని పదార్థాల వంటివి అమ్మకోసం తీసుకొని రావటం జరుగుతుండేది. అమ్మ వారి తృప్తి కోసం తన భోజన సమయంలో వాటిని కొద్దికొద్దిగా తీసుకొంటుంటే వారంతా యెంతో సంతోషించేవారు.

దుర్గా పూజోత్సవాలు ప్రారంభమైనాయి. రమణాశ్రమం లోని కాళీమాతకు సప్తమి తిథి నుండి మూడు రోజులు విశేష పూజలు నిర్వహింపబడ్డాయి. హోమాలు, అఖండనామ సంకీర్తనలు, వేలాదిమందికి అన్నసంతర్పణలు జరిగాయి. మూడు రోజులు అసంఖ్యాక భక్తులు ఉత్సవాలలో పాల్గొని శ్రీ ఆనందమయి అమ్మను, కాళికామాతను భక్తిశ్రద్ధలతో సేవించుకొని ధన్యులైనారు. అప్పటినుండి ప్రతి సంవత్సరము అదేవిధంగా వైభవోపేతంగా దుర్గా పూజలు జరపటం ప్రారంభమైంది.

భగవదవతారమూర్తి అయిన శ్రీ ఆనందమయి మాత అమృత వాక్కులు, బోధలు వింటున్న భక్తులకు ఆమె దివ్యత్వం అర్థం అవటం మాత్రమే కాదు, వారిని ఆత్మపథం వైపు పయనించేలాగా ఉత్తేజ పరుస్తుండేది. కేవలం జనులను వుద్ధరించేందుకు మాత్రమే భూమిపైకి వచ్చిన ఆ మహనీయులకు నిజానికి సృష్టిలోని యే ఒక్క విషయం పైన గాని, యే ఒక్క పదార్థం పైన గాని, యెటువంటి మమకార వికారాది గుణాలు వుండవు. ఈ విషయం వారి మాటలలో, చర్యలలో అనుక్షణం వ్యక్తం అవుతూనే వుంటుంది.

శ్రీ ఆనందమయి మాత ఒకసారి భక్తులతో "ఇప్పుడు మీరు యిక్కడ చూస్తున్నదంతా యీ శరీరం ఆడుతున్న ఆట మాత్రమే! నిజానికి నాకు యీ శరీరంతో గాని, మరి ఏ యితరమైన విషయాలతో గాని, సంబంధాలు గాని, బంధనాలు గాని లేనే లేవు" అన్నారు

ఒకరోజు శ్రీ ఆనందమయి అమ్మ అమ్మమ్మ గారితో (తనను కన్నతల్లితో) "చూడమ్మా, నువ్వు నా కన్నతల్లివి అయిన కారణంగా నాకు

యీ భక్తులందరిపైన కంటే నీపైన లేశమాత్రమైనా ప్రత్యేకమైన ప్రేమ యేమీ వుండదు. అటువంటి బంధనాలు నా దరిచేరే పరిస్థితిలో తక్షణమే నేను మీ అందరిని, యీ శరీరాన్ని విడిచి వెళ్లిపోతాను" అన్నారు.

"ఈ శరీర సంబంధీకులైన వారి పైనా మిగతావారి పైనా నాకు ఒకే రకమైన భావం వుంటుంది. భేదభావం అనేది లేదు. ఆ భావంతోనే మీ అందరి మధ్యనా సంచరిస్తున్నాను. ఎవరిని దరి చేర్చుకోగలను? ఎవరిని వదులుకోగలను? అటువంటిదేమీ వుండదు. నాకు అందరూ సమానులే" అనేవారు అమ్మ.

ఒకసారి ఒక భక్తురాలు అమ్మను యిలా ప్రశ్నించింది: "అమ్మా! మీ స్వామి మీకు గురుతుల్యులు. వారి పట్ల మీ ధర్మము, కర్తవ్యము అన్నింటికంటే ముఖ్యమైన విషయం అనేది మీకు కూడా వర్తిస్తుంది అనుకుంటే మీరు మీ స్వామితో సమానమైన వున్నత స్థానంలో ప్రతి ఒక్కరిని అంతటి విశేషమైన రీతిలో గౌరవించడం, ప్రేమించడం చేస్తారా? 'నాకు అందరూ సమానులే' అంటున్నారు కదా. మీ స్వామితో మేమందరం ఎలా సమానం అవుతామమ్మా?" ఆ భక్తురాలు అమ్మను అలా ప్రశ్నించిన సమయంలో శ్రీ భోలానాథ్ గారు కూడా అక్కడే వున్నారు. అమ్మ నవ్వుతూ, వున్నది వున్నట్లుగా నీ ప్రశ్నకు సమాధానం చెప్పానంటే, శ్రీ భోలానాథ్ గారికి నా మీద కోపం వస్తుంది" అంటూ బాగా నవ్వసాగారు. భక్తులు కూడా అమ్మ మాటలకు నవ్వుతూ, ఆ భక్తురాలు అడిగిన ప్రశ్నకు అమ్మ యేమని సమాధానం చెబుతారా అని ఎంతో ఉత్కంఠతతో యెదురు చూడసాగారు. శ్రీ ఆనందమయి అమ్మ, "నాకు అందరూ సమానులే. అందరిపైన ఒకే భావం వున్నప్పటికీ, యెవరి పట్ల యే భావం వుండాలో, యెవరితో యెలా ప్రవర్తించాలో అదే విధంగా వ్యవహరించడం జరుగుతుంది. బాల్యంలో తల్లిదండ్రులే గురువులు. ఆ తర్వాత వారే నాకు స్వామిని పరిచయం చేశారు. ఆ విధంగా వివాహం తర్వాత నాకు స్వామి పట్ల గురుభావం కలిగింది. కానీ యిప్పుడు నాకు ప్రపంచమంతా గురురూపంగా కనిపిస్తున్నది. అందరూ గురు స్వరూపాలే. నువ్వు కూడా గురువే" అన్నారు.

రమణాశ్రమ ప్రవేశం తరువాత అమ్మకుటుంబసభ్యులతోఆశ్రమంలోనే నివసించసాగారు. రమణాశ్రమంలో అమ్మ దినచర్య చాలా విలక్షణంగా వుండేది. అమ్మ ఉదయాన్నే లేచి బయట మైదానంలో కొంతసేపు తిరిగి వచ్చేవారు. ఆ తర్వాత కొంచెం ఆహారం తీసుకొని పడుకుండిపోయేవారు. ఒక్కొక్కసారి రోజంతా నిద్రపోతూ వుండేవారు. ఆహార విహారాలలో ఒకే రకమైన సమయ నియమం యేమీ వుండదు. ఒక్కొక్కసారి సాయంత్రం వరకు నిద్రపోయి ఆ తర్వాత లేచి కొద్దిగా భుజించేవారు. ఒక్కొక్క రోజు మధ్యాహ్నం ఆహారం తీసుకునేవారు. కొన్ని రోజులు కేవలం కొద్ది పండ్లు మాత్రమే తీసుకునేవారు. ఒక్కొక్కప్పుడు రోజంతా మౌనంగా కూర్చుని వుండేవారు, ఏమీ తినేవారు కాదు. భక్తులు భోజనం చేయమని అడిగినప్పుడు, "ఏదైనా కొంచెం తీసుకువచ్చి నా నోట్లో పెట్టండి" అనేవారు. మరొకసారి "నాకు తినాలనిపించినప్పుడు తింటాను" అనేవారు. ఈ సమయానికి నిద్రించాలి ఈ సమయానికి భుజించాలి అనే నియమాలేవీ అమ్మకు లేవు. కాలం యొక్క పరివర్తన, ప్రభావం అమ్మ పై యేమాత్రం వుండదు అనేది నిజం.

రమణాశ్రమంలో వంటశాల నిర్మాణం కూడా పూర్తి అయి వంటలు కూడా ప్రారంభించారు. వంటలు చేసేటప్పుడు చాలా పరిశుభ్రత పాటించేవారు. మాధవి అత్త, అమ్మమ్మగారు గురుప్రియ, మరికొందరి స్త్రీలు వంట చేసేవారు. షాహ్-బాగ్ లో వున్నప్పుడు వంట కోసం నీటిని బ్రాహ్మణులు తెచ్చేవారు. ఆ తర్వాత ఎవరో ఒకరు కుల వివక్ష లేకుండా మంచినీరు తీసుకొని రానారంభించారు. శ్రీ ఆనందమయి మాత ఒకసారి వంట, భోజనం విషయంలో యిలా చెప్పారు: "అందరి సంస్కారాలు ఒకే విధంగా వుండవు. అందువలన అన్ని రకాల వ్యక్తుల చేతి వంట తినటం మంచిది కాదు. వంట యెవరికోసం చేస్తున్నాము, ఈ ప్రసాదం స్వీకరిస్తున్న వారెవ్వరు? అన్న ప్రశ్న వంట చేసేవారు ఆలోచించాలి. భగవంతుని నివేదన కోసం వండుతున్నాము. ఈ నైవేద్యం తినే వారంతా నారాయణ స్వరూపులే అనే భావం వుండాలి. ప్రతి ఒక్కరూ భగవంతుని ప్రసాదం తీసుకుంటున్నాము అన్న భావంతోనే భోజనం చేయాలి."

ఆశ్రమంలో భక్తులైన బ్రాహ్మణ స్త్రీలు వంట చేసేవారు. ఉత్సవ సమయాలలో భక్తులు అధిక సంఖ్యలో వస్తారు కనుక వంటవారిని పిలిపించేవారు. బ్రాహ్మణుల చేత

సంప్రోక్షణ జరిపించి భగవంతునికి నివేదించేవారు. అమ్మ ఆదేశానుసారం యివన్నీ జరిగేవి. భోలానాథ్ గారు వంట విషయంలో యెంతో శ్రద్ధ వహించేవారు. శ్రీ ఆనందమయి అమ్మకు యే కులంవారు వంట చేసినా ఆమె వరకు యెటువంటి అభ్యంతరము లేకపోయినప్పటికీ ప్రజలందరి మనోభావాలను అనుసరించి వారి శ్రేయస్సుకై కొన్ని నియమాలను భక్తుల చేత ఆచరింపచేసేవారు. శ్రీ భోలానాథ్ గారు కూడా యీ నియమాలను అతిక్రమించేవారు కాదు.

ఒక సందర్భంలో శ్రీ ఆనందమయి అమ్మ ఈ విషయం గురించి యిలా చెప్పారు: "జాతి, కుల, మత భేదభావనలు అనేవి ఆచారాలు సాంప్రదాయాల విషయంలో మనసులలో బలంగా నాటుకొని వున్నప్పుడు కొంతకాలంపాటు వాటిని అనుసరించి నడుచుకొనటం తప్పుకాదు. సాధనాబలంతో కాలక్రమేణా యిటువంటి భేదభావాలు తొలగిపోతాయి".

1929 సంవత్సరం శ్రీ ఆనందమయి మాత జన్మదినోత్సవాలు ముగిసిన కొన్నాళ్లకు, అంటే ఫాల్గుణ మాసంలో అమ్మ భోలానాథ్ గారిని సిద్ధేశ్వరి ఆలయంలోని గదిలో వుంటూ సాధన చేయవలసిందిగా ఆదేశించారు. శ్రీ భోలానాథ్ గారు అమ్మ ఆదేశం ప్రకారం సిద్ధేశ్వరి వెళ్లిపోయారు. రమణాశ్రమం లోని బ్రహ్మచారి ఒకరు ప్రతిరోజు వెళ్లి శ్రీ భోలానాథ్ గారి సదుపాయాలు చూడటం, ఆశ్రమం నుండి భోజనం తీసుకుని రావడం వంటి సేవలు చేసేవాడు. రాత్రిపూట శ్రీ భోలానాథ్ గారి వద్ద నిద్రించేవాడు. తరచూ అతుల్ బాబు శ్రీ భోలానాథ్ గారి వద్దకు వెళుతుండేవాడు. అప్పుడప్పుడు శ్రీ ఆనందమయి మాత వచ్చి శ్రీ భోలానాథ్ గారిని చూచి వెళ్తుండేవారు. ఇలా రెండు నెలల కాలం గడిచింది.

సిద్ధేశ్వరిలో సాధన సాగిస్తున్న సమయంలో శ్రీ భోలానాథ్ గారికి అప్పుడప్పుడు వివిధ రకములైన ఆధ్యాత్మిక అనుభూతులు కలుగుతుండేవి. ఆ సమయాలలో ఆయన తన అంతఃకరణ ప్రేరణతో కొందరు బ్రహ్మచారులకు దీక్ష ప్రదానం చేస్తుండేవారు. అలా ఎంతోమంది బ్రహ్మచారులు ఆ సమయంలో ఆ రోజులలో శ్రీ భోలానాథ్ గారి నుండి దీక్షాగ్రహణం పొందటం జరిగింది. ఆ రోజులలో అంటే 1930 సంవత్సరంలో ఆయన పంచవటి స్థాపించాలనుకున్నారు. శ్రీ ఆనందమయి మాత, శ్రీ భోలానాథ్ గారు కుటుంబ సమేతంగా ఢాకాను వీడి రమణశ్రమానికి వచ్చిన తర్వాత ఆశ్రమంలో కాళీమాత మందిరానికై కేటాయించిన ప్రదేశంలోని కొంతభాగంలో పంచవటి స్థాపన చేయ సంకల్పించారు. ముందుగా శ్రీ భోలానాథ్ గారు ఆ ప్రదేశాన్ని పూజించి ఆ తర్వాత మర్రి, రావి, అశోక, ఉసిరిక, మేడి – ఈ ఐదు రకాల మొక్కలను నాటారు. ఆ మొక్కలు నాటే సమయంలో ఆయా మొక్కలకు సంబంధించిన బీజమంత్రాలు ఆయనకు స్ఫురించేవి. ఆయన ఆ మంత్రాన్ని జపిస్తూ ప్రతి ఒక్క మొక్కను నాటడం జరిగింది.

పంచవటి స్థాపించే సమయంలో ఆయన తీవ్ర భక్త్యావేశంలో ఆ ప్రదేశంలో ఎంతోసేపు మట్టిలో ఆ నేలపై పొర్లాడారు. ఆయన శిరస్సు నుండి పాదాల వరకు శరీరం అంతా దుమ్ము, ధూళి, మట్టితో నిండిపోయింది. శ్రీ ఆనందమయి అమ్మ ఆ సమయంలో అక్కడే నిలబడి చూస్తున్నారు. ఆమె అనుమతి తీసుకుంటూ ప్రతి ఒక్క మొక్కను శ్రీ భోలానాథ్ గారు నాటడం జరిగింది. ఈ విధంగా ఆశ్రమంలో పంచవటి స్థాపింపబడింది. ఆ పంచవటి నడిమధ్యన అమ్మ కూర్చునేందుకు ఒక పెద్ద అరుగును నిర్మించారు.

పంచవటి స్థాపన సమయంలో ఒక విశేషమైన ఘటన చోటు చేసుకున్నది. అశోక మొక్కను నాటే సమయంలో ఆ మొక్క వేరుకు కొంచెం కూడా మట్టి లేకపోవడం గమనించి ఒక భక్తుడు "ఈ మొక్క వేరుకు ఏమాత్రం మట్టి లేదు. బహుశా ఇది నాటు కొనదేమో" అన్నాడు. "ఎందుకు నాటుకోదు? తప్పకుండా నాటుకుంటుంది. నాటు కొనడమే కాదు, ఇది యెప్పటికీ యెండిపోవడం అనేది జరగదు" అన్నారు శ్రీ భోలానాథ్ గారు. అలా చెపుతూ ఆయన ఆ అశోక మొక్కకు సంబంధించిన యే బీజమంత్రం అయితే తన మనసుకు అప్రయత్నంగా స్ఫురించిందో, ఆ మంత్రాన్ని జపిస్తూ ఆ అశోక మొక్కను నాటారు. ప్రతిరోజూ ఆ మొక్కలకు నీరు పోస్తూ వాటిని యెంతో జాగ్రత్తగా భక్తులు చూచుకోసాగారు. కొద్ది రోజులు గడిచేసరికి అన్ని మొక్కలు బాగా నాటుకొని చక్కగా చిగురించి పెరుగుతున్నాయి. కానీ అశోక మొక్క మాత్రం రోజురోజుకు వాడిపోయి కొద్ది రోజులకు పూర్తిగా యెండిపోయింది.

'ఎండిపోయిన మొక్క యిక్కడ వుండి యేమి ప్రయోజనము? దీనిని తీసేసి యిక్కడ క్రొత్త మొక్కలు నాటితే సరిపోతుంది' అనుకుంటూ కమల కాంత్ ఆ మొక్కను పీకేసి ఒక పక్కన పడేశాడు. ఉన్నట్లుండి ఒక రోజున సిద్ధేశ్వరి నుండి రమణాశ్రమానికి వచ్చిన శ్రీ భోలానాథ్ గారు పీకివేయబడిన ఆ మొక్కను చూచి ఎంతో ఆందోళనతో మరల ఆ మొక్కను అదే ప్రదేశంలో నాటి, "దీనిని యేమీ కదిలించవద్దు. ఈ మొక్క యెప్పటికీ చనిపోవడం అనేది జరగదు. దీనిని నీరు పోస్తూ శ్రద్ధగా చూసుకొనండి" అని భక్తులతో చెప్పారు. ఆ తర్వాత శ్రీ ఆనందమయి అమ్మ మరొక అశోక మొక్కను తెచ్చి ఈ మొక్కతో కలిపి నాటవలసిందిగా శ్రీ భోలానాథ్ గారికి చెప్పడంతో ఆయన అదే విధంగా చేశారు. కొద్ది రోజులకు ఆశ్చర్యంగా ఆ యెండిపోయిందనుకున్న ఆ మొక్క చిగురించి పెరుగుతుండటం చూసి అందరూ యెంతో ఆనందించారు. కాలక్రమేణా అది బాగా పెరిగి పెద్దదై, మహావృక్షం అయింది.

సిద్ధేశ్వరిలో దీక్షాసమయం పూర్తి అయిన తర్వాత ఒకరోజు శ్రీ భోలానాథ్ గారు రమణాశ్రమానికి వచ్చి శ్రీ కాళీమాతకు పూజ చేశారు. ఆనాటి నుండి ఆయన రమణాశ్రమంలోనే వుండిపోయారు.

రమణాశ్రమ నివాసం ప్రారంభమైన తర్వాత కొన్ని నెలలకు అమ్మ దక్షిణ దేశ యాత్ర చేయ సంకల్పించారు. దక్షిణ దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలన్నీ దర్శించడానికి కొన్ని నెలల కాలం పట్టవచ్చు కనుక అందుకు తగిన సన్నాహాలు చేసుకుని శ్రీ ఆనందమయి అమ్మతో పెద్ద భక్త సమూహం బయలుదేరింది.

అమ్మ బృందం అంతా మొదట విశాఖపట్నం వెళ్లారు. విశాఖపట్నంలో నాలుగు రోజులు వుండి నగరంలోనూ, సముద్ర తీరప్రాంతాలలోనూ వున్న ఆలయాలను దర్శించారు. అక్కడి నుండి మద్రాసు వచ్చి మద్రాసులో వారం రోజులపాటు ముఖ్య ప్రదేశాలలో పర్యటించారు అమ్మ. కావేరి, గోదావరి ప్రాంతాలలోని మందిరాలను దర్శించారు. అటునుండి పక్షితీర్థం, చిదంబరం, శ్రీరంగం, కాంచీపురం, మధురై – ఇలా అనేక క్షేత్రాలకు వెళ్లారు. ఈ ప్రదేశాలన్నింటిలోనూ ఒక్కొక్క క్షేత్రంలో ఒకటి రెండు రోజులు, లేక కొన్ని గంటలు గడిపి మరొక క్షేత్రానికి బయలుదేరేవారు. రామేశ్వరంలోని సేతుబంధంలో వారం రోజులున్నారు అమ్మ. దక్షిణ దేశంలో చూడదగిన ప్రదేశాలెన్నో వున్నాయి. అమ్మ సమయానుకూలాన్ననుసరించి ఆయా క్షేత్రాలు దర్శించి ఆ తర్వాత కన్యాకుమారి క్షేత్రానికి వచ్చారు. ఆ ప్రాంతం జనసంచారం లేక నిర్మానుష్యంగా వుండడం వలన అక్కడ గాఢమైన నిశ్శబ్దం తాండవిస్తుంటుంది. సముద్రతీర ప్రాంతంలో వుండే ఆ ప్రశాంత ప్రదేశంలో శ్రీ ఆనందమయి అమ్మ 15 రోజులున్నారు.

కన్యాకుమారి క్షేత్రంలో ప్రజలు తమిళం గానీ, తెలుగు గానీ మాట్లాడుతారు. శ్రీ ఆనందమయి మాత భక్తులు బెంగాల్ దేశస్థులు కావటంతో వాళ్లకు అక్కడి ప్రజలు మాట్లాడే భాష ఒక్క ముక్క కూడా అర్థం అయ్యేది కాదు. అక్కడ వున్న కొద్ది రోజులలో అమ్మ కొన్ని తమిళ, తెలుగు పదాలు తాను నేర్చుకొనటమే కాక భక్తులకు కూడా నేర్పారు.

సముద్రపు ఒడ్డున వున్న కన్యాకుమారి మాత దేవాలయం ఎంతో అందంగా వుంటుంది. ఆ దేవి కుమారి రూపంలో దర్శనమిస్తుంది. అమ్మ భక్తబృందంతో కలిసి సముద్రపు ఒడ్డున వున్న ఒక ధర్మశాలలో బస చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వారందరూ దేవీ దర్శనం చేసుకునేవారు. ప్రతిరోజు అభిషేకం చేసిన అనంతరం దేవి ఒంటినిండా గంధము పూస్తారు. ఆ తర్వాత పసుపు, కుంకుమ, పుష్ప గంధాక్షతలతో పూజించి ధూప దీప నైవేద్యాలతో, మంగళహారతులతో దేవిని అర్చిస్తారు. సంధ్యా సమయంలో ఆలయ అర్చకుల పిల్లలయిన చిన్న చిన్న బాలికలు అందరూ కలిసి అమ్మవారికి ఎదురుగా పాటలు పాడుతూ నాట్యం చేస్తారు. ఆ చిన్న పిల్లలు గాఘ్రాలు ధరించి కాళ్లకు గజ్జెలు కట్టుకొని అలా నాట్యం చేస్తుంటే ఆ దృశ్యం యెంతో మనోహరంగా వుండేది. శ్రీ ఆనందమయి మాత ప్రతి ఉదయం, సాయంత్రం సముద్రపు ఒడ్డున కొంతసేపు తిరిగి వస్తుండేవారు. అమ్మకు ఆ పిల్లలతో పరిచయం యేర్పడింది. ఆ పిల్లలు అమ్మను ధర్మశాలకు తీసుకువెళ్లి అమ్మను మధ్యలో కూర్చోబెట్టి అమ్మ చుట్టూ గుండ్రంగా తిరుగుతూ పాటలు పాడుతూ నాట్యం చేసేవారు. ఆ ప్రాంతంలో కొబ్బరికాయలు, అరటికాయలు బాగా పండుతాయి. అమ్మ ప్రతిరోజు ఆ పిల్లలకు కొబ్బరికాయలు, అరటిపండ్లు యిచ్చేవారు. శ్రీ ఆనందమయి మాత ఆలయంలోని అర్చకులకు, అక్కడ వున్న

బ్రాహ్మణులకు ఒక రోజున, మరొక రోజున చిన్న చిన్న అమ్మాయిలకు అన్నసంతర్పణ చేశారు. భక్తులు అమ్మ ఆదేశంతో ఆ అమ్మాయిలను దేవి మందిరానికి తీసుకొని వెళ్లి వారిని పూలమాలలతో అలంకరించి, గంధ పుష్పాక్షతలతో పూజించి హారతులు యిచ్చారు. అమ్మ ఆ పిల్లలందరికీ వస్త్రాలు యిచ్చి సత్కరించారు. అక్కడి గృహాలలోని స్త్రీ పురుషులందరూ అమ్మను మహాత్మురాలిగా గుర్తించి భక్తితో పూజించుకున్నారు. అలా అందరిని సంతోషపరిచి అమ్మ కన్యాకుమారి నుండి తిరుగు ప్రయాణం అయినారు. అమ్మ బయలుదేరే సమయంలో ఆ బాలికలు అమ్మతో రైల్వేస్టేషన్ కు వచ్చి మళ్లీ మళ్లీ తమ ఊరికి రమ్మని సైగలతో ప్రార్థిస్తూ వీడ్కోలు చెప్పారు. అమ్మ కూడా నవ్వుతూ సైగలతోనే సమాధానాలు చెబుతూ వారిని సంతోషపరిచారు.

కన్యాకుమారి క్షేత్రంలో జరిగిన ఒక సంఘటన యిక్కడ చెప్పుకోనాలి. గురుప్రియా దేవి తండ్రి అయిన శశాంక్ బాబు ఒకరి ఒక రిటైర్డ్ సర్జను. పదవీ విరమణ పొందిన కొద్ది కాలానికి ఆయన పూర్వ పుణ్యం వలన ఆయనకు అమ్మ యొక్క దివ్యసాన్నిధ్యం లభించింది. అమ్మకు గొప్ప భక్తుడై అమ్మ అనుగ్రహంతో ఎన్నో కఠిన సాధనలు చేసి గొప్ప ఆధ్యాత్మిక పరిణితిని పొందిన భాగ్యశాలి. ఒకరోజు కన్యాకుమారి క్షేత్రంలో ఆలయం లోపల కూర్చుని శశాంక బాబు కనులు మూసుకొని జపం చేసుకుంటున్నాడు. అప్రయత్నంగా ఆయన కనులు వున్నట్లుండి తెరుచుకున్నాయి. కనుల ఎదుట మేలిమి బంగారు ఛాయతో ఒక బాలిక నిలబడి ఆయననే చూస్తూ దర్శనమిచ్చింది. శశాంక బాబు దిగ్భ్రాంతితో చూస్తూ 'ఎవరీ అమ్మాయి?' అనుకుంటుండగానే ఆ అమ్మాయి వెనుకకు నడుస్తూ వెళ్ళసాగింది. అలా వెనక్కి నడుచుకుంటూ కన్యాకుమారి విగ్రహం వరకు వెళ్లి ఆ విగ్రహం లో కలిసిపోయింది. అయితే శశాంక బాబు ఈ దివ్యానుభవాన్ని ఎవ్వరికీ చెప్పలేదు. చాలా సంవత్సరాల తర్వాత ఒకరోజు ఆయన ప్రసంగవశాన అమ్మ సమక్షంలో యీ విషయాన్ని వెల్లడించారు.

శ్రీ ఆనందమయి మాత కన్యాకుమారి క్షేత్రం నుండి బయలుదేరి త్రివేండ్రం చేరుకున్నారు. అక్కడి ఆలయంలో శేషతల్పశాయి రూపంలో శ్రీ పద్మనాభ స్వామి ప్రతిష్ఠితులై వున్నారు. లక్ష సాలగ్రామ శిలలతో ఎంతో అందంగా తయారు చేయబడిన అద్భుతమైన పద్మనాభ స్వామి వారి భారీ విగ్రహాన్ని దర్శించడానికి పైనుండి క్రింది వరకు 3 మహాద్వారాలు ఏర్పాటు చేశారు. పైన వున్న ద్వారం నుండి స్వామివారి శిరోభాగము, మధ్య ద్వారం నుండి స్వామి శరీరంలోని మధ్యభాగము, మూడవ ద్వారం నుండి స్వామివారి చరణ కమలాలను దర్శింపజేస్తారు. దండకమండలుధారి అయిన ఒక సన్యాసి అక్కడ పూజారిగా వున్నాడు. మొట్టమొదటగా ప్రాతఃకాలాన ఆ పూజారి ఆలయ మందిరంలో ప్రవేశిస్తాడు. అంతవరకు యే ఒక్కరూ మందిరంలో ప్రవేశించరు. ఒక గొప్ప మహారాజు వచ్చిన అతడు కూడా వేచి వుండవలసిందే. అది అక్కడి నియమం. ఎందరో మహారాజులు స్వామికి ఎంతో ధనము, ఆభరణాలు, మాన్యాలు సమర్పించారు. ప్రతిరోజు 3000 మందికి తక్కువ లేకుండా అక్కడ బ్రాహ్మణ సంతర్పణ జరుగుతుంది. స్వామివారి ధనాగారం చాలా పెద్దది. ఆ గుడి యజమాన్యంవారు శ్రీ ఆనందమయి మాతకు ఆ ధనాగారాన్ని చూపించారు. అమ్మవారికి, స్వామికి అలంకరించే ఎన్నో సువర్ణ రత్నాభరణాలు, కిరీటాలు, మణిహారాలు, సింహాసనాలు అనేకమైన వెండి బంగారు పాత్రలతో నిండి వున్నది ఆ ధనాగారం. ఆ క్షేత్రంలో కొద్ది రోజులు వుండి అమ్మ తిరుగు ప్రయాణమైనారు.

త్రివేండ్రం నుండి శ్రీరంగ పట్టణం అటునుండి బెంగుళూరు, బొంబాయి వెళ్లి; బొంబాయిలో సముద్రమార్గంలో ద్వారక నగరం వెళ్లి శ్రీకృష్ణ దర్శనం చేసుకున్నారు అమ్మ. అటునుంచి వింధ్యాచలం, కాశి, గయాధామ్ వెళ్లారు. గయలో బుద్ధ మందిరంలో తప్పకుండా నిద్ర చేయాలన్న అమ్మ ఆదేశంతో భక్తులందరూ అమ్మతో కలిసి అక్కడ వున్న పెద్ద అందమైన తోటలో చెట్ల క్రింద దుప్పట్లు పరుచుకొని నిద్రించారు. సాధారణంగా ఆ తోటలోకి ఎవరినీ అనుమతించరు. అయితే అమ్మ సాధారణ వ్యక్తి కాదని ఒక గొప్ప మహాత్మురాలని గుర్తించి, ప్రతి క్షేత్రంలోనూ యెక్కడా యెవ్వరూ అమ్మను యే విషయంలోనూ ఆటంక పరచలేదు. అందువలన అన్నిక్షేత్రాలలోనూ భక్తులు అమ్మ సాంగత్యంలో ఆయా క్షేత్రాలలోని విశేషమైన ప్రదేశాలన్నింటిని స్వేచ్ఛగా దర్శించుకున్నారు.

ఆ తర్వాత శ్రీ ఆనందమయి మాత జంషెడ్పూర్ వెళ్లారు. అక్కడ

ప్రభుత్వోద్యోగిగా వున్న యోగేశ్ బాబు తమ్ముడైన కృష్ణబాబు అమ్మకు గొప్ప భక్తుడు. అతడు అమ్మను భక్తులను తన ఇంటికి తీసుకొనివెళ్ళాడు. శ్రీ ఆనందమయి మాత తమ ఊరు వచ్చారన్న విషయం తెలుసుకున్న అక్కడి ప్రజలు తండోపతండాలుగా వచ్చి అమ్మను దర్శించుకోసాగారు. ఎడతెరిపి లేకుండా రాత్రింబగళ్లు అమ్మ దర్శనార్థం వచ్చే భక్తులతో, పూజలు భజనలతో యెంతో విశాలమైన కృష్ణబాబు బంగళా యెంతో సందడితో ఒక పుణ్యక్షేత్రాన్ని తలపింప చేసింది. పూర్ణిమ, అమావాస్య దినాలలో భక్తులందరికీ అన్న సంతర్పణల కార్యక్రమం కూడా ఆరంభమైంది.

ఆ విధంగా జంషెడ్-పూరులో కొన్ని నెలలు వుండి అచ్చటి ప్రజలలో దైవభక్తిని పెంపొందింపజేసి అమ్మ కలకత్తాకు వచ్చారు. కలకత్తాలో యతీష్ దాదా అనే ఒక భక్తుడు అమ్మను భక్తుల ఆహ్వానం మేరకు అమ్మ అంగీకారముతో వారి ఇండ్లకు తీసుకొనివెళ్ళాడు. అందులో పశుపతి బాబు ఇల్లు ఒకటి. ఇతడు యతీష్ దాదా కు మేనమామ. యతీష్ దాదా తమ్ముళ్ళైన క్షితీష్, నితీష్ కూడా అమ్మపై విశేషమైన ప్రేమను కలిగి వుండేవారు. పశుపతి బాబు తన గురువైన యోగిరాజు గంభీరనాథ్-జీ ని నిరంతరం అపారమైన భక్తిశ్రద్ధలతో సేవించేవాడు. శ్రీ ఆనందమయి మాత ఒక సాధారణ స్త్రీ మాత్రమే అని అతని భావం. అందువలన తన అల్లుళ్లయిన క్షితీష్, నితీష్ లు అమ్మపై అంతటి భక్తి కలిగి వుండటం అతనికి నచ్చేది కాదు. ఒకసారి అతడు నేరుగా అమ్మ వద్దకు వెళ్లి అమ్మతో, "అమ్మా! మీరు యీ విధంగా మా పిల్లలను యింతగా ఆకర్షిస్తూ యిలా ఆడుకుంటున్నారు. మీరు యిట్లా యెందుకు చేస్తున్నారో చెపుతారా?" అంటూ అమ్మను నిలదీశాడు. అమ్మ నవ్వుతూ, "బాబుగారూ మీకు నేను యిలా చేస్తున్నానని అనిపిస్తే మీరు నన్ను శిక్షించవచ్చు" అన్నారు. ఇలా యెన్నోసార్లు పశుపతి బాబు అమ్మతో తన అల్లుళ్లకు ఆమెపై వున్న పిచ్చి ప్రేమ పట్ల తన అసంతృప్తి, అసహనం వ్యక్తంచేస్తూ మాట్లాడేవాడు. అయితే కొంతకాలం గడిచిన తర్వాత ఆయనలో ఆశ్చర్యకరమైన మార్పు వచ్చింది. ఆయనకు అమ్మపై వున్న భావం పూర్తిగా మారిపోయింది. తన అల్లుళ్లుయిన క్షితిష్, నితీష్ ల కంటే కూడా యెక్కువగా అమ్మను ఆరాధించసాగాడు. అతడు వాస్తవంగా గొప్ప ఆధ్యాత్మిక సాధకుడు. నిరంతరం పూజలు, భజనలు, దైవ సంబంధమైన కార్యక్రమాలు, సత్సంగాలు యిలాంటి సత్కార్యాలతోనే కాలం గడుపుతుండేవాడు. అమ్మ పట్ల అతనిలో వచ్చిన ఆ మార్పుకు అందరూ ఆశ్చర్యపోయేవారు. ఒకరోజు ఆయన అమ్మతో కన్నీళ్లు కారుస్తూ యిలా అన్నాడు: "అమ్మా! యిన్నాళ్లు నిన్ను గుర్తించలేకపోయాను. నువ్వెవరో యిప్పుడు నాకు అర్థమయింది. అందరూ నిన్ను 'అమ్మ' అని పిలుస్తారు. కానీ నాకు మాత్రం నువ్వు నా బాబా వే! ఎందుకంటే నాకు యిప్పుడు మీకు, నా బాబాకు తేడాయే కనిపించటం లేదు" అన్నాడు. అలా జీవితమంతా అమ్మ సేవలో తరించిన భాగ్యశాలి పశుపతి బాబు.

అలా దక్షిణదేశ యాత్ర ముగించుకొని కలకత్తా వచ్చిన శ్రీ ఆనందమయి అమ్మ అక్కడ కొందరు భక్తుల ఆహ్వానంతో వారి గృహాలకు వెళ్లి, వారిని అనుగ్రహించి తిరిగి రమణాశ్రమం చేరుకున్నారు.

1930వ సంవత్సరం అమ్మ జన్మ దినోత్సవ వేడుకలకు సన్నాహాలు ఆరంభమైనాయి. జన్మ దినోత్సవాలు ఆరంభమవటానికి ముందు ఒక వారం రోజులు మౌనవ్రతంలో వున్నారు అమ్మ. వైశాఖమాసం ప్రారంభం నుండి కృష్ణపక్ష చవితి అమ్మ జన్మదినం వరకు భక్తులు సంకీర్తన చేయ నిశ్చయించారు. ఉత్సవాలలో అసంఖ్యాక ప్రజలు పాల్గొని అమ్మకు విశేష పూజలు జరిపి కృతార్థులైనారు. ఆనాటి రాత్రి అమ్మ పంచవటి అరుగుపై కూర్చున్నారు. ఆ సమయంలో శ్రీ భోలానాథ్ గారు అమ్మను పూజించడం జరిగింది. అసంఖ్యాక భక్తులతో, సంకీర్తనలు భజనలతో, అన్నసంతర్పణలతో, అమ్మ జన్మదినోత్సవ వేడుకలు రమణాశ్రమంలో దిగ్విజయంగా ముగిశాయి.

జన్మదినోత్సవాలు ముగిసిన తర్వాత అమ్మ మరల కలకత్తా వచ్చారు. కొద్దిరోజుల తర్వాత కాక్స్ బజారులో వకీలుగా పనిచేస్తున్న దీనబంధు చక్రవర్తి అనే అమ్మ భక్తుడు అమ్మను కాక్సు బజారు తీసుకువెళ్లాడు. సముద్రపు ఒడ్డున వున్న తన పెద్ద బంగాళాలో అమ్మకు, భక్తులకు బస, వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశాడు.

**- సశేషం**

# పుంభావ సరస్వతి

-శ్రీ సి. హెచ్. పాండురంగ శర్మ

**(ప్రథమ దర్శనములోనే మాస్టరుగారి కృపా విశేషము చేత అక్కల్కోట స్వామి పాదుకలను అందుకొని "నీ ఫణితి బాగుంది. నా పిల్లలకు సంస్కృతం నేర్పండి" అని వారి ప్రశంసలను అందుకొన్న భాగ్యశాలి.)**

నేను మాస్టరుగారి దగ్గరకు (తారీఖు గుర్తులేదు) వచ్చాను. నా భార్య విపరీతమైన తలనొప్పితో బాధపడ్తుండేది. సాయి లీలామృతం, పారాయణ చేస్తే తగ్గుతుందని ఎవరో చెప్పగా ఆ గ్రంథం మాస్టరుగారింట్లో లభిస్తుందేమోనని వారింటికి వెళ్ళాను. మాస్టరుగారు లోపల నుండి కర్పూర హారతి తీసుకుని బయటకు వచ్చి శ్రీ అక్కల్ కోట స్వామి పాదుకలకు హారతిచ్చారు. బయట కూర్చుని వున్న నేను హారతి కళ్ళకద్దుకున్నాను. ఇంతలో మాస్టరుగారు నాతో "పాదుకలు తీసుకుని లోపలకు రండి" అని అన్నారు. ఇంతలో ఒక కుర్రవాడు "సార్, ఇతను కాదు పాదుకలను తీసుకువచ్చింది. అతను బజారు దాకా వెళ్ళి వస్తానని చెప్పి వెళ్ళిపోయారు సార్" అన్నాడు. అప్పుడు మాస్టరుగారుండి "ఓహో! అలాగా, అయితే సరే, మీరు పాదుకలు లోపలకు తీసుకురండి" అన్నారు. అప్పుడు ఆ పాదుకల్ని తీసుకుని అమ్మగారు, మాస్టరుగారు వుండే హాలులో వుంచే అదృష్టం కల్గింది. ఆ తర్వాత నేను మాస్టరుగారికి కొంచెం ఎడంగా కూర్చున్నాను. అప్పుడు మాస్టరుగారు "వద్దు ప్రక్కన కూర్చో" అని దగ్గరగా కూర్చోబెట్టుకున్నారు. మాస్టరుగారిని అంతకు ముందు ఒకసారి మా స్కూలుకి 'మధ్యాహ్న భోజన పథకం' ప్రారంభోత్సవానికి పిలిచాము. అప్పుడు చూశాను. ఆ సందర్భంలో మా హెడ్-మిస్ట్రెస్ గారు "మీరు వారితో సంస్కృతంలో మాట్లాడితే సంతోషిస్తారు" అన్నారు. వారు పిల్లలకు చిన్న చిన్న కథలు చెప్పారు. అవెంతో బాగున్నాయి. అప్పుడు నేను మాస్టరుగారిపై ఆశువుగా ఒక పద్యం చెప్పాను. పూర్తిగా గుర్తులేదు కాని ఒక బిట్ గుర్తుంది. "బాలానాం సుఖ బోధాయ క్రమతే కథాసంగ్రహం" అంటూ చెప్పాను. మాస్టరుగారు "అరె ఇప్పటికిప్పుడే ఎంత బాగా వ్రాశారే, చాలా బాగుంది" అంటూ సంతోషించారు. ఇది మళ్ళీ రెండోసారి చూడటం.

"నువ్వు అప్పుడు చెప్పిన శ్లోకం బాగుందయ్యా" అని ఒక శ్లోకం చదవమన్నారు. 'శాంతాకారం భుజగ శయనం' అనే శ్లోకం చదివాను. "మహిమ్నా స్తోత్రం వచ్చా?" అన్నారు. వచ్చన్నాను. ఒక శ్లోకం చెప్పమన్నారు. 'త్రయీ సాంఖ్యం యోగః' అన్న శ్లోకం చదివాను. "దీన్ని గురించి మీ భావం ఏమిటి" అన్నారు. "భగవంతుడు ఒక్కడే. నిశ్చలమైన మనస్తత్వంతో భగవదారాధన చేయడమే నా ధ్యేయం అండీ" అన్నాను. "ఇంకా ఏమన్నా స్తోత్రాలు వచ్చా?" అన్నారు. "చాలా వచ్చండీ" అన్నాను. "సాయిబాబా అంటే అసలు ఇష్టం వుందా? లేదా?" అని అడిగారు. "నాకు ద్వేషం ఏమీ లేదండి, కాని తరచుగా గుడికి వెళ్ళటం అలవాటు లేదండీ" అన్నాను. కాసేపు మాస్టరుగారు మౌనంగా వున్నారు. నేను వచ్చిన విషయం చెప్పాను. "నా భార్య ఎప్పుడూ తలనొప్పితో



బాధపడ్తుంటుంది. సాయిలీలామృతం పారాయణ చేస్తే తగ్గుతుందని చెప్పారు. ఆ పుస్తకం దృష్టిలో పెట్టుకుని యిలా వచ్చి మిమ్మల్ని కలిశానండి" అన్నాను. పుస్తకం అడిగినందుకు ఆయన చాలా ఆనందించారు. "అట్లా అయితే యిస్తానయ్యా కాసేపు మాట్లాడిన తర్వాత" అని, "భాగవతంలో భక్తి, భారతంలో నీతి, రామాయణంలో రామునికి భరతునికి వున్న సౌభ్రాతృత్వం ప్రధానం అని వాటి గురించి కొంచెంసేపు ముచ్చటించుకున్నాము. చర్చించుకున్నాము. "రోజూ బాబా గుడికెళ్తుండండి, వెళ్ళి వస్తుంటే మంచిది, బాగుంటుంది" అన్నారు. ఆ తర్వాత "వెళ్ళొస్తానండి" అంటే, "ఏమిటి తొందర పడ్తున్నావు?" అన్నారు. "ఈ రోజు సోమవారమండి ఉపవాసం, వెళ్ళి భోజనం చేయాలి అందుకని" అన్నాను. "అయితే ఒక్క నిమిషం కూర్చోండి" అన్నారు మళ్ళీ. "ఉపవాసం అంటే ఏమిటి?" అని ప్రశ్నించారు. "ఉప అంటే సమీపం, వాసము అంటే వసించుట అన్నాను. "ఎవరికి సమీపంగా వుండుట?" అని మళ్ళీ ప్రశ్నించారు. "భగవంతుని మనోభావములకు, తత్త్వమునకు దగ్గరగా నుండుట" అన్నాను. వెంటనే "గురుచరిత్రలో సోమవార వ్రత మహాత్మ్యం వుంది. ఆ కథను మీ భార్యాభర్తలిరువురు పారాయణ చేసుకుని భగవంతునికి పూజ చేసి భోజనం చేయండి" అని చెప్పారు. నేను వెళ్ళేటప్పుడు మాస్టరుగారు సాయిబాబా పుస్తకంతో సహా మొత్తం ఆ పుస్తకాలను నాకు యిచ్చారు. అప్పుడు నేను మాస్టరుగారితో "ఆడబోయిన తీర్థం ఎదురైనట్లుగా, నాకు చాలా సంతోషమైంది" అన్నాను. అప్పుడు మాస్టరుగారు "నాకొక సంకల్పం వుందయ్యా" అన్నారు. "నీ ఫణితి చాలా బాగుంది. నా పిల్లలకు సంస్కృతం శబ్దముల దగ్గర నుండి ప్రారంభించి నీవు చెప్పాలయ్యా" అన్నారు. "నేను పండితుడను కానండి. నేను చెప్పగలిగేటంత సమర్థుడిని కాను" అన్నాను. వెంటనే మాస్టరుగారు, "నీకు చేతనైనంతవరకే చెప్పండి, అందరం తెలిసిన వాళ్ళం కాముగా" అన్నారు. "అలాగేనండి" అని వచ్చేశాను. చాలా అకస్మాత్తుగా మాస్టరుగారు సమాధి చెందారు. అమ్మగారు 6నెలల తర్వాత నాకు కబురు పంపారు. మాస్టరుగారి సంకల్పాన్ని అమ్మగారు శిరసావహించి, వారి పిల్లలకు సంస్కృతం నేర్పమన్నారు. అప్పట్నించి వస్తూ నావల్ల వారిగ్గాని, వారి వల్ల నాగ్గాని ఎలాంటి ఇబ్బందులూ లేకుండ, నాకు తీరిక సమయంలో పాఠం చెప్పుకుంటూ మాస్టరుగారి మాటకు బద్ధుడనగుచు వారి భావములకు అంకితమగుచు నేటి వరకు నడచుకొనుచున్నాను. నాకైన అనుభవంలో మాస్టరుగారి సహృదయత, భక్తిభావం, నిరాడంబరత, గురుచరిత్ర అనువాదం తెలుపుచున్నది. సాయిలీలామృతము నందు కంటే గురుచరిత్రయందు నాకు చాలా అభీష్టము. దానియందు నృసింహ సరస్వతీ స్వామివారి అద్వైత తత్త్వము, వారి మహిమలు, శక్తి, సంతుష్టి, ధ్యానం యిత్యాది అనేక విషయాలు నన్ను ఎంతగానో ప్రేరేపించినాయి. ఆ గురుచరిత్రను ఎన్నో పర్యాయములు పారాయణ చేయమని నా మనస్సు కాంక్షించుటయే కాక తోటివారి క్కూడా చెప్పించుచున్నది. గురుచరిత్ర అనువదించి ప్రపంచానికి అందించుటలో మాస్టరుగారు చేసిన కృషి అమూల్యము, శ్లాఘనీయము. జన్మజన్మాంతరముల సంస్కారము వుంటేగాని ఈ సత్కార్యమునకు అంటే యితరులకు దోహదపడటమనేది సాధ్యం కాదు. అలాంటి గురువర్యులు సాక్షాత్ పుంభావ సరస్వతీస్వరూపులు, బాబా తుల్యమైన మాస్టరుగారికి సర్వదా ధన్యవాదములు. ఇప్పుడు నా భార్యకు తలనొప్పి తగ్గిపోయింది. ●

# ద్వారకామాయి అనుభవమండపము

*K.C. పోటే*

శ్రీసాయి సశరీరులుగా మనమధ్య నివసించిన కాలంలో ఎందరికో తాము సకల దేవతాస్వరూపి అనే అనుభవాన్ని ప్రసాదించారు. అందులో ప్రత్యేకించి మానవాళికి సాక్షాత్తు త్రిమూర్త్యాత్మకుడైన భగవంతుడే గురువుగా, యోగనాథుడిగా అవతరించి, తన భక్తులకు భుక్తిముక్తులను ప్రసాదించే దత్తాత్రేయస్వామి తామేయని నిరూపించారు. ఈ అనుభవం మహాసమాధి తర్వాత కూడా ఈ నాటికీ కలుగుతున్నది. వారిలో శిరిడీ వాస్తవ్యుడైన శ్రీ K.C. పోటే ఒకరు. ఇతడు తన అనుభవాన్ని ఇలా చెబుతున్నాడు.

"నాకు సాయి ముస్లిమని, ఫకీరని చాలాకాలం సంకోచం వుండేది. నేను శిరిడీలో వుంటున్నప్పటికీ ప్రధానంగా దత్తాత్రేయస్వామినే కొలిచేవాడిని. లిండీకి వెళ్తున్నప్పటికీ అక్కడ దత్తాత్రేయ స్వరూపమైన మేడిచెట్టు (ఉదుంబరము)కు, దాని క్రింద స్థాపించబడిన దత్తాత్రేయ స్వామికి ప్రదక్షిణ చేసేవాడిని. లాంఛనంగా మాత్రమే సాయిబాబా నమస్కరించేవాడిని. అనేకమంది భక్తులు నుండి సాయిబాబా దత్తాత్రేయులవారి అవతారమని వింటున్నప్పటికీ నాకు మాత్రం అట్టి విశ్వాసం చాలాకాలం వరకు కలగలేదు. ఒకరోజు నేను మేడిచెట్టుకు ప్రదక్షిణం చేస్తున్నాను. ప్రతి ప్రదక్షిణం ఆరంభంలో దాని క్రింద ప్రతిష్టించబడిన దత్తాత్రేయునికి నమస్కరిస్తున్నాను. అదేమి విచిత్రమో కానీ ఆ రోజు నేను అలా చేసినప్పుడల్లా ఆ మూర్తికి బదులు శ్రీ సాయినాథుని రూపమే ప్రత్యక్షమవుతున్నది. ఆశ్చర్యముతో నా కన్ను చెదిరిందేమోనని కళ్ళు నులుముకుని మరల మరల చూసాను. కానీ ప్రతిసారి నాకు అలానే దర్శనమయింది. ఒక ప్రదక్షిణం చేసినప్పుడు సాయి రూపము తర్వాత ప్రదక్షిణం చేసినప్పుడు దత్తాత్రేయ రూపము ప్రతిసారి కనిపిస్తూనేవున్నది.

ఆ సంగతి తలుచుకుంటే యిప్పుడు కూడా రోమాంచితమవుతుంది. నాటినుండి శ్రీ సాయి దత్తాత్రేయుల వారి సంపూర్ణ అవతారమని విశ్వాసం కలిగింది.

శ్రీ సాయిచరిత్ర పారాయణ చేస్తూ మౌనం పాటిస్తున్నాను. నేను సంకల్పించిన కార్యము సిద్ధించేటట్లయితే, పారాయణ పూర్తయ్యే లోపల సాయి నాకు ఏదైనా నిదర్శనం యివ్వాలని తలచాను. ఒక రోజు నేను పొలంలో వున్నాను. ఆ సమయంలో గ్రామములో మా ఇంటికి ఒక ఫకీరువచ్చి, "ఇక్కడ పారాయణ చేస్తున్నదెవరు? నాకు భిక్ష కావాలి" అని అడిగారట. నేనప్పుడు మౌనంలో వుండటం వల్ల ఆ ఫకీరుని వెంటబెట్టుకొని మా పనిమనిషి నా వద్దకు వచ్చి ఆ విషయం చెప్పాడు. నేను కుటీరము లోంచి బయటకు వచ్చేసరికి ఆ ఫకీరు నాకు ఎక్కడా కనిపించలేదు. నాటి నివేదన సాయికి సమర్పించాను."

# ఆచార్యుని అద్భుత లీలలు

***శ్రీ కోటేశ్వరరావు, బాపట్ల***

పూజ్యశ్రీ భరద్వాజ్ మహారాజ్ లీలావైభవాన్ని బాపట్లకి చెందిన శ్రీ కోటేశ్వరరావుగారు ఈ విధంగా తెలియచేస్తున్నారు.

మొట్టమొదట పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి 1992-94 సంవత్సరముల మధ్య నాకు తెలిసింది. అంతకు ముందు దైవమంటే ఏమాత్రం భక్తిశ్రద్ధలు వుండేవి కావు. మాది పెద్ద ఉమ్మడి కుటుంబం. మేమందరం ఒంగోలులో వుండేవాళ్ళం. నేను స్టేట్ ఎక్సయిజ్ ఆఫీసులో చిన్నస్థాయి ఉద్యోగం చేసేవాడిని. అంతంతమాత్రం సంపాదనతో కుటుంబం నడవడం చాలా కష్టంగా వుండేది. దానితో చాలా అప్పులయ్యాయి. పేకాట, సింగల్ నెంబర్ లాటరీ ఆడి బాగా డబ్బులు సంపాదించి, అప్పులన్నీ తీర్చి, కొంత సంపాదన ఒక పక్కన పెట్టుకుని, హాయిగా కూర్చుందామని ప్రణాళికలు వేసేవాడిని. కానీ ఏదీ కలిసి రాలేదు. పైగా సినిమా యాక్టరు N.T.రామారావుగారి మీద అభిమానంతో, తెలుగుదేశం పార్టీలో తిరిగేవాణ్ణి. ఈ తీరికలేని పనులవల్ల, చెప్పాపెట్టకుండా ఉద్యోగం కూడా మానేసాను.

ఈలోగా సింగల్ నెంబర్ లాటరీ బాపట్ల, చీరాలలో తీసేసి, ఏలూరులో పెట్టారు. ఇక ఎలాగైనా ఏలూరువెళ్ళి, తీవ్రప్రయత్నం చేసి, లాటరీలో నెగ్గాలని నిర్ణయించుకుని, నా భార్యని, వాళ్ళ పుట్టింటికి బాపట్ల పంపించాను. నేను విజయవాడ వెళ్లి ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాను. రాత్రి 9 గంటల ప్రాంతంలో కిందకి వచ్చేసరికి, ఒకతను పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు అమ్ముతున్నాడు. "ఇవి తెలుసా?" అనడిగాడు. "నాకు తెలియదు" అన్నాను. వాటి గురించి చెప్పి, పూజ్యశ్రీ మాస్టరుగారిది, చిన్న ఫోటో ఒకటి ఇచ్చి, "ఈయన చాలా పవర్-ఫుల్ (powerful)" అన్నాడు. సరేనని తీసుకుని జేబులో పెట్టుకున్నాను. నన్ను శ్రీ సాయిలీలామృతం గ్రంథం ఆకర్షించింది కానీ కొనలేదు.

అనుకున్న ప్రకారం మర్నాడు, నేను ఏలూరు వెళ్లి లాటరీ ఆడేముందు, నా జేబులో నుంచి, పూజ్యశ్రీ మాస్టరుగారి ఫోటో తీసి ఆయనతో "మీరు చాలా పవర్-ఫుల్ అని చెప్పారు, కనక మీ దయతో, ఎంతొచ్చినా పది శాతం మీకు, మిగిలినది నాకు" అని చెప్పుకుని ఆట మొదలు పెట్టాను. ముందర 600 రూపాయలు వచ్చాయి. చాలా సంతోషం, ధైర్యం వచ్చాయి. కానీ సాయంత్రానికి మొత్తం డబ్బులన్నీ పోయాయి. నాకు విపరీతమైన నిరాశ వచ్చింది. ఇంటికెళ్తే అప్పులవాళ్ళు చుట్టుముడతారు. వాళ్లకి, ఇంట్లోవాళ్ళకి ఏం సమాధానం చెప్పుకోవాలి? అన్న ఆలోచనలు నన్ను చుట్టుముట్టి, ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చాను. జేబులో వున్న ఆయన ఫోటో తీసి, 'మీరేమి పవర్-ఫుల్ కాదండి, మీవల్ల ఏమి లాభం లేదండి' అనుకుని, అక్కడ ఒక దుకాణం అరుగు వుంటే పూజ్యశ్రీ మాస్టరుగారి ఫోటోని అక్కడ పెట్టేసి వెళ్లిపోయాను.

ఒంగోలు వచ్చి రంగారావు చెరువు దగ్గర పెద్ద బావిలో దూకేద్దామని ప్రయత్నం చేస్తూ వుండగా, దూరంగా లాయరుపేట బాబాగుడి కనిపించి, దర్శనం చేసుకుని చనిపోదామని గుడికి వెళ్లాను. బాబాకి దణ్ణం పెట్టుకుని కూర్చోగానే, మర్నాడు కార్యాలయానికి (ఆఫీసు కి) వెళ్లాలనిపించింది. అప్పటికి నా ప్రయత్నం విరమించుకుని, మర్నాడు ధైర్యంతో ఆఫీసుకి వెళ్లి కార్యాలయాధికారి గదికి వెళ్ళాను. ఊహించినట్లుగానే, చాలా కోపంగా మాట్లాడి వెళ్ళిపొమ్మన్నారు. కానీ నా ఉద్యోగం యింకా తీసెయ్యలేదు. నేను మర్నాడు మళ్లీ వెళ్లాను. నిజానికి నా మనస్తత్వానికి మళ్ళీ వెళ్లేవాడిని కాదు. కానీ ఎందుకో వెళ్లాలనిపించింది. కార్యాలయంలో అధికారి గదికి వెళ్లే తలుపు పక్కన గోడకి బాబా చిత్రపటం

వుంది. లోపలకి వెడుతూ ఆయనతో 'ఈరోజు కూడా వెళ్లిపొమ్మంటే, నేను ఉద్యోగానికి రాజీనామా చేస్తాను' అని చెప్పుకున్నాను. చిత్రంగా ఆయన నన్ను ఏమి అనకపోగా, చాలా సౌమ్యంగా, ప్రేమగా మాట్లాడి, "నీపని నువ్వు ఖచ్చితంగా చేస్తావు. నువ్వు టైపింగ్ కూడా బాగా చేస్తావు. ఇకనించీ రోజూ వస్తూండు. నీ సమస్యలన్నీ మాకు తెలుసు" అంటూ ఎంతో ధైర్యం చెప్పారు. అప్పుడు మొదటిసారిగా నాకు బాబామీద నమ్మకం కలిగింది. అంతేకాదు, నిరాశానిస్పృహలు పోయి ధైర్యం వచ్చింది. నాకోసం వెదుకుతున్న, అప్పులవాళ్ళ ఇంటికి నేనే ధైర్యంగా వెళ్లి కనపడ్డాను. వాళ్ళందరూ కూడా ఎంతో ప్రేమగా నాతో మాట్లాడారు. అప్పుడు నాకు శ్రీ సాయిలీలామృతం చదవాలనిపించి, కొనుక్కుందామని యెంత ప్రయత్నించినా కుదరలేదు.

మొట్టమొదట నేను చదివిన గ్రంథం 'శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్ర'. ఆ గ్రంథం చదువుతుంటే, ప్రత్యక్షంగా పూజ్యశ్రీ మాస్టరుగారు నాతో మాట్లాడుతున్నట్లు అనిపించింది. ఆ రచనా శైలికి ముగ్ధుడినైపోయాను. ఆయన పోటీలేని, 'హీరో' అనిపించింది. తరవాత చీరాల స్వామి చరిత్ర దొరికింది. అది చదివాక పూజ్యశ్రీ మాస్టరుగారి మీద ఇంకా ఆరాధనా భావం కలిగి, ఆయన పట్ల మనసులో ఉన్నతమైన స్థానం ప్రతిష్టించుకున్నాను. ఈయన తోడుంటే మన జీవితానికి ఏమి ఢోకా లేదు అనిపించి, ఆయన దర్శనం కోసం ప్రయత్నిస్తే సమాధి అయిపోయారని తెలిసింది. ఇదంతా 1992-94 మధ్య జరిగింది.

మొత్తానికి ఒకసారి నాకు శ్రీ సాయి లీలామృతం పారాయణ చేసే భాగ్యం కలిగింది, అది చదివాక, 'ఇంత స్పష్టంగా, అర్థవంతంగా బాబా గురించి ఎవరూ చెప్పలేరు' అనిపించింది. తరవాత వారి రచనలన్నీ, ఒకదాని తరవాత ఒకటి, చదవడం మొదలు పెట్టాను. అవన్నీ చదువుతుంటే నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయ్యారనిపించేది కాదు. నాతోనే వున్నారనిపించేది.

నాకు మాస్టరుగారి ఇల్లు చూడాలనిపించి వెళ్లాను. పూజ్యశ్రీ అమ్మగారి దర్శనం చేసుకున్నాను. నేను బాపట్లలో స్థిరపడి, ఉద్యోగానికి ఒంగోలు వెళ్ళేవాడిని. ఉదయమే బాపట్లలో పినాకిని ఎక్సుప్రెస్ ఎక్కి, ఒంగోలు లో దిగి, తిన్నగా పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరానికి వెళ్లి, అక్కడనించి అమ్మగారి దర్శనానికి వెళ్లి, అప్పుడు కార్యాలయానికి వెళ్ళేవాడిని.

1996-97 ప్రాంతంలో పూజ్యశ్రీ మాస్టరుగారు నన్నింతగా ఆకర్షించారు కదా! వారు నా గురువు ఔనా కాదా తెలుసుకోవాలి అనిపించింది. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన మార్గంలోనే శ్రీ గురుచరిత్ర పారాయణ చేద్దాం అనుకుని, ఒక సంకల్పం చేసుకున్నాను. అదేమిటంటే, మీరే నా గురుదేవులని స్వప్నం ద్వారా కాకుండా, ప్రత్యక్ష నిదర్శనం యివ్వాలని చెప్పుకున్నాను. సప్తాహ పారాయణ మొదలుపెట్టాను. రోజూ ఉద్యోగం అయ్యాక, ఒంగోలు నించి బాపట్ల చేరుకున్నాక, రాత్రి స్నానం చేసి, పారాయణ అయ్యాక, భోజనం చేసేవాడిని. ఒకొక్కసారి ఏదైనా పని ఉంటే పినాకిని తప్పిపోయి వేరే రైలులో వస్తే రాత్రి 12గంటలయ్యేది. మొత్తానికి వారం రోజులలో పూర్తిచేశాను. పారాయణ పూర్తయ్యాక ఒక ఆదివారం నాడు పూజ్యశ్రీ మాస్టరుగారి పటం పెట్టుకుని, వారి ముందు చిన్న పళ్లెంలో బెల్లం ముక్క పెట్టి, "నేను నామం చెప్పుకుంటూ వుంటాను. మీరు ఏ రూపంలోనైనా ఆ ప్రసాదం స్వీకరిస్తే, మీరే నా గురువని అనుకుంటాను, లేకపోతే లేదు" అనుకుని కళ్ళుమూసుకుని నామం మొదలు పెట్టాను. 70 నామాలు పూర్తయ్యేసరికి, పళ్లెం టకాటకా చప్పుడయింది. నేను కళ్ళు తెరవకుండా నామం చెప్తున్నాను. కొంతసేపటికి ఎవరో నా ముఖం నాకుతున్నారు. వెంటనే కళ్ళు తెరిచి చూసాను, నా ఎదురుగా ఒక కుక్క నా ముఖంలో ముఖం పెట్టి నిల్చుని వుంది. అది నేను పెట్టిన పళ్లెంలో ప్రసాదం తినేసి నా ముఖం కూడా నాకింది. అప్పుడు నాకు పూజ్యశ్రీ మాస్టరుగారే నా గురుదేవులని నిరూపణ అయ్యింది!!

ఈ రైలు ప్రయాణంలో ప్రతిరోజూ పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు పారాయణ చేసేవాడిని. ఎవరైనా అడిగితే వారి గురించి చెప్తూ వుండేవాడిని. బాలకృష్ణ గారు అనే ఆయన పరిచయం అయ్యారు. మేమిద్దరం బాగా సత్సంగం చేసుకునేవాళ్లం. పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగం ప్రాముఖ్యత చెప్పారు కదా, మనం సత్సంగం చేద్దామని, బాపట్లలో, బాబా గుడిలో సత్సంగాలు మొదలు పెట్టాము. కొంతమంది, బాబాకి దణ్ణం పెట్టుకుని వెళ్ళిపోయేవారు. కొంతమంది సత్సంగంలో కొంతసేపు ఉండి వెళ్ళిపోయేవారు. కొన్నాళ్ళు ఇలా గడిచాక, ఇళ్ళకి వెళ్లి సత్సంగాలు చేద్దామనిపించి, బాబా, మాస్టరుగార్ల పటాలను నేను, బాలకృష్ణ, పట్టుకుని

వెళ్లి సత్సంగాలు మొదలు పెట్టాము. మొట్టమొదట శంకర్ గారనే వారింట్లో చేసాము. వారు ఉపాధ్యాయులు. నేను బాబా చరిత్ర చదివి వివరించేవాడిని. ఏ గ్రంథం చదువుతున్నా దానికి సంబంధించిన విషయాలు వేరే గ్రంథాలలోవి, అనుసంధానమయ్యేవి. నేను చెప్పేది నేనే ఆశ్చర్యంగా వింటుండేవాడిని. సత్సంగాలు పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన విధానంలోనే, నిరాడంబరంగా చేసేవాళ్ళం.

ఇలా కొంతకాలం జరిగాక పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహంతో ఒక సత్సంగ బృందం ఏర్పడింది. మాకు బాబా చరిత్ర దృశ్యరూపంలో ఎందుకు చెయ్యకూడదు? అనిపించి, పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో మొదలు పెట్టాము. అది ఇప్పటికీ చిన్న చిన్న మార్పులు చేసుకుంటూ, ప్రదర్శించడం జరుగుతోంది. సత్సంగాలలో పాల్గొన్న వాళ్లకి పూజ్యశ్రీ మాస్టరుగారు చాలా అనుభవాలు ప్రసాదించారు, ప్రసాదిస్తున్నారు. మేమందరం సత్సంగాలు చేసుకునేటప్పుడు జరిగిన అనుభవాలు ఒకటి రెండు, మీతో పంచుకుంటాను.

మా సత్సంగం లో 'పూజ్యశ్రీ మాస్టరుగారి పాదుకలు వుంటే బాగుండును' అనిపించింది. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు ఆరాధనకు, మేమే పాదుకలు చేయించుకుని, ఒంగోలు సమాధి మందిరానికి తీసుకెళ్లి, తాకించుకుని, తెచ్చుకున్నాము. మా దగ్గర ప్రతి ఆదివారం సత్సంగం జరుగుతుంది. అప్పుడు ఆ పాదుకలకు అభిషేకం, అష్టోత్తరం చేసుకుని, సత్సంగం మొదలుపెట్టుకునే వాళ్ళం. సత్సంగం అయిపోయాక, అందరం ఆ పాదతీర్థం తీసుకునేవాళ్ళం. ఒక ఆదివారం ఉదయం ఒంగోలు వెళ్లాం. అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి అభిషేకం చేసిన తీర్థం, మాకు ఒక సీసాలో యిచ్చారు. ఆరోజు సాయంత్రం సత్సంగం మొదలుపెట్టబోయే ముందు, ఈరోజు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరనించే తీర్థం వచ్చింది కదా అన్న ఉద్దేశంతో, మా సత్సంగంలో ఉన్న పాదుకలకు అభిషేకం చెయ్యలేదు. సత్సంగం మొదలుపెట్టే ముందు, అందరికి ఈవిషయం చెప్పి, తీర్థం నింపి వున్నా సీసా (బాటిల్), పక్కన పెట్టి, సత్సంగం చేసుకున్నాము. సత్సంగం అంతా అయ్యాక , తీర్థం కోసం సీసా తీసి చూస్తే అందులో ఒకబొట్టు కూడా తీర్థం లేదు. ఇదేమిటని అందరం ఆశ్చర్యపోతుంటే, అది వేసవికాలం అవ్వడం వలన ఒక అబ్బాయికి దాహం వేసి తాగేశాడని తెలిసింది. ఆ రోజు పాదుకలకు అభిషేకం చెయ్యనందువల్ల, పూజ్యశ్రీ మాస్టరుగారు మాకు గుణపాఠం చెప్పారని మాకనిపించింది. ఇక ఆ రోజునించి ఈరోజు వరకు ఎప్పుడూ మానలేదు. పూజ్యశ్రీ అమ్మగారి పాదుకలు మాదిరాజు పద్మావతమ్మ గారు (వారి దగ్గర వున్నవి) మాకు యిచ్చేసారు. ఈవిధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు పాదుకల రూపంలో మా సత్సంగంలో కొలువైవుండి మా సేవలందుకొంటున్నారు.

ఆరు సంవత్సరాల క్రితం, గురుపూర్ణిమ ఉత్సవం, ఎప్పుడూ చేసేలాగకాక నూతనంగా చేసుకోవాలని మాకు సంకల్పం కలిగింది. ఇంక గురుపూర్ణిమ మూడు రోజులుందనగా, నేను సత్సంగ సభ్యులతో, 'అందరం ఈరోజు పడుకునే ముందు పూజ్యశ్రీ మాస్టరుగారిని ఈ ఉత్సవం ఎలా చేసుకోవాలో తెలియచేయమని ప్రార్థిద్దాం' అని చెప్పాను. ఆ రోజు రాత్రి సత్యం అనే ఆయనకి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శనం యిచ్చారట. ఇతను, మేము అనుకుంటున్నది అడిగాడట, అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు "మీరు చెప్పినా చెయ్యరు, ఎందుకురా చెప్పడం" అన్నారట! చేసుకుంటాం మాస్టరుగారు అని ప్రార్థిస్తే, "108 పువ్వులతో, 108 మంది దంపతులతో అష్టోత్తరం చెయ్యండిరా" అన్నారట. ఇతను "రెండే రోజులుంది, అవుతుందా మాస్టరుగారూ" అంటే, "అందుకే నేను చెప్పనన్నానురా, అవుతుందిలే ఫో" అన్నారట. ఆ విషయం మాకు చెప్పాడు.

ఇంక అప్పటికి రెండు రోజుల సమయమే వుంది. సరే మాస్టరుగారు చెప్పారు కదా అని మా ప్రయత్నాలు మొదలుపెట్టాం. అంతమందితో పూజ అంటే చాలా పెద్ద స్థలం కావాలని, తెలిసిన వాళ్ళ స్థలంలో ఏర్పాట్లు చేసాం. సత్సంగ సభ్యుల చుట్టాలకి, తెలిసిన వాళ్లకి కబురు చేసాం. పువ్వులు 120 రకాలు దొరికాయి. రేపు పూర్ణిమ అనగా, ఈ రోజు షామియానాలు వేసి, ముగ్గులువేసి, అన్ని రకాల అలంకరణలు పూర్తిచేసుకున్నాం. కానీ ఆ రాత్రి పెద్దగాలి, వానా వచ్చి, షామియానాలన్నీ పడిపోయాయి. మర్నాడు మేమంతా వెళ్లేసరికి ప్రాంగణం అంతా భీభత్సంగా వుంది. మళ్ళీ అన్ని లేపి, అన్ని సమకూర్చుకుని పూజకి సిద్ధమయ్యేసరికి 60 మంది వచ్చి వున్నారు. సరే మన ప్రయత్నం మనం చేసాం, ఇక మాస్టరుగారి

దయ అనుకుని, పూజ మొదలు పెట్టాం. వీళ్ళ పూజ అవుతుండగానే, ఇంకొక 60 మంది వచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహంతో, వారు చెప్పిన విధంగా గురుపూర్ణిమ ఉత్సవం విజయవంతమయ్యింది.

అలాగే ఎన్నో సార్లు దత్తక్షేత్రాలకి యాత్రలకి వెళ్ళాం. గురుదంపతుల కళ్యాణ మహోత్సవం జరుపుకుంటున్నాం. దీక్షలు, కోలాటాలు, భజనలు, పాటలు, పర్వదినాలలో ఉత్సవాలు, యివన్నీ, ఎంతో కోలాహలంగా భక్తిపూర్వకంగా పూజ్యశ్రీ భరద్వాజ్ మహారాజ్, సమర్థ సద్గురు సాయినాథుని అనుగ్రహంతో జరుగుతున్నాయి. అది ఇక్కడి అందరి అనుభవం కూడా. ఇలాగే మమ్మల్నందరిని, సన్మార్గంలో నడిపిస్తూ, సత్సంగాలని పెంపొందింప చేసుకునేలా అనుగ్రహించమని, గురుదేవుల చరణ కమలములకు సాష్టాంగ ప్రణామములర్పిస్తున్నాను.

జై సాయిమాస్టర్!!

## జ్ఞాని మాటకర్థం జ్ఞానులే తెల్పాలి!

03వ పేజీ తరువాయి

సర్వదా ఎలా కలిగేదో కూడా ఆ భక్తురాలి అనుభవాలు నిరూపిస్తాయి.

తమ యొక్క ఈ తత్వాన్ని సూచిస్తూనే కాబోలు – బాలాభావూ అనే ఒక భక్తుడు ఒక అర్ధరాత్రి మసీదులో సాయిని దర్శించి తనకు ఉపదేశమిచ్చి శిష్యునిగా చేసుకోవలసినదిగా కోరినప్పుడు, "గురువుండి తీరవలసిన అవసరం లేదు. సర్వమూ మనలోనే వున్నది. మనమేమి చేస్తామో, దానికి తగ్గ ఫలితం వస్తుంది. నీవేది ఇతరులకు యిస్తావో, అదే నీకు లభిస్తుంది. వేరే గురువు అవసరం లేదు. అంతా నీలోనే వున్నది. హృదయం తెలిపేది వినడం, అది చెప్పినట్లు నడవడమూ నేర్చుకో. మనను మనం చూసుకోవాలి. అదే మన గురువు" అన్నారు సాయి. స్థూలదృష్టికి గురువు అవసరం లేదని చెప్పినట్లు తోచినా, ఈ భక్తుడి అనుభవం చూస్తే అలా హృదయంలో గురువును గుర్తించడం కూడా అతనికి సాయియే క్రమంగా నేర్పవలసి వచ్చినదని తెలియగలదు. ●

## మాతృదేవి స్మృతులు

01వ పేజీ తరువాయి

లోపలికి వెళ్ళాము. శ్రీ అమ్మగారికి నమస్కరించుచున్నాము. శ్రీ అమ్మగారు మాతో చాలా ఆప్యాయంగా మాట్లాడారు. మావారి డ్యూటీ విషయము, 'రిటైర్మెంట్ కి ఇంకా ఎన్ని సంవత్సరాలు వుంది' అని అడిగారు. ఆరోగ్యం విషయం అడిగి తెలుసుకున్నారు. నా ఆరోగ్యం కూడా అడిగారు. మావారితో పూజ్యశ్రీ అమ్మగారికి నచ్చిన ఒక పాట పాడించుకొన్నారు. (శరణం నీవని తలచితిని, సకలము నీవని తెలిసితిని, నీ సన్నిధిలో నిలిచితిని. ఆర్తితో నిన్నే పిలిచితిని, కావరావా శ్రీ సాయినాథ, బ్రోవరావా గురు భరద్వాజ). నాకు ఒక సేవను ప్రసాదించారు. చాలా సంతోషం కలిగింది. నాకు అది ఏమిటంటే "కన్నడ మహాత్ముల, భగవద్భక్తుల చరిత్రలు ఆర్టికల్స్ గా వ్రాయి. పత్రికలో ప్రచురించటానికి ఉపయోగపడుతుంది" అని అన్నారు. "అమ్మా నాకు సరిగ్గా తెలుగే రాదు నేను ఎలా రాయగలను అమ్మా" అంటే "నీవు ప్రయత్నించు. అదే వస్తుంది" అన్నారు.

అమ్మగారి దయవల్ల నా ఇష్టదైవమైన శ్రీ రాఘవేంద్రస్వామి వారి చరిత్రను వ్రాసి అమ్మగారికి సమర్పించిన రోజే నా 12 ఏళ్ల నాటి మొక్కు తీర్చుకోవటానికి మంత్రాలయం వెళ్ళే అవకాశం దొరికింది. మంత్రాలయం వెళ్లి అక్కడ 7 రోజులు సేవ చేసుకోగలిగాను.

పూజ్యశ్రీ అమ్మగారు జగ్గయ్యపేటలో వున్నప్పుడు మాకు ఒక దీక్షను ప్రసాదించారు జీవితాంతం గాణగాపూర్ లో సంవత్సరానికి మూడు రోజులు దర్శనం, సేవ, నిద్ర చేయమన్నారు. శ్రీ రాఘవేంద్రస్వామివారి ఆరాధనలు మూడు రోజులు, మూడు మఠాలలో బృందావనాలు దర్శించమన్నారు.

మనందరికీ పెద్ద దిక్కుగా గురుదంపతులు వుండబట్టి, ఎన్నెన్నో పెద్ద పెద్ద ప్రమాదాలు దాటుకుంటూ, తిరిగి ప్రశాంతమైన జీవితాలని గడుపుతున్నాము. అంతటి కరుణామయులకు నేను, మావారు "ఏ జన్మలోనూ మాచేయి వదలొద్దని" ప్రార్థన చేసుకుంటూ కృతజ్ఞతా పూర్వక నమస్కారాలు సమర్పించుకుంటున్నాము.

జై సాయి మాస్టర్!!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**

Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |

# మనము - మన సంస్కృతి



పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.



శ్రీ తాజుద్దీన్ బాబా జయంతి
(27-01-2024)



IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.